సత్యం శివం సుందరం
శ్రీ సరస్వతీ విద్యాపీఠము

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక


సంపుటి : 48 సంచిక : 10 వెల : రూ. 18/- పుటలు : 36

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ-కార్తీక మాసములు అక్టోబర్ : 2025





## ఆర్.ఎస్.ఎస్. @ 100



**శ్రీశారదాధామం:-** శ్రీమతి స్వరూప రాణి సహాయాచార్య పదవీ విరమణ సందర్భంగా సత్కరిస్తున్న శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం-శ్రీశారదాధామము



**సంగారెడ్డి:-** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల సంగారెడ్డిలో శ్రీ మాచిరెడ్డి రమణారెడ్డి విభాగ్ అంకేక్షక్ గా 36 సంవత్సరాలు సేవలందించి పదవి విరమణ పొందినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా శ్రీ పతకమూరి శ్రీనివాసరావు ప్రాంత సంఘటనా కార్యదర్శి విచ్చేసి సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా శ్రీ సాయి రెడ్డి విఠల్ రెడ్డి గారు విభాగ్ అధ్యక్షులు మాట్లాడుతూ రమణారెడ్డి గారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రాంత అంకేక్షక్ శ్రీ పూజారి వెంకట గోపాల కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగవిరమణ అనేది ప్రతి వ్యక్తికి తప్పని సరి అని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కే.మురళీధర్ రెడ్డి గారు జిల్లా అధ్యక్షులు, విభాగ్ లోని పాఠశాలల ప్రధానాచార్యులు మరియు కార్యాలయ ప్రముఖ్ లు తదితరులు రమణారెడ్డి గారిని ఘనంగా సన్మానించారు.



**బాన్సువాడ:-** శ్రీ సరస్వతీ శిశుమందిర్ బాన్సువాడ పాఠశాలకు పిల్లల డాక్టర్ తోట కిరణ్ కుమార్ గారి సహకారంతో డాక్టర్స్ అసోసియేషన్ ద్వారా రూ॥ 1,70,000/- ల విలువగల అవుట్ డోర్ గేమ్స్, ప్లే ఐటమ్స్ని పాఠశాలకు అందించారు.



**తిరుపతి:-** శ్రీ సరస్వతీ శిశు మందిర్, తిరుపతి పాఠశాల యందు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ Dr. లింగుట్ల రమేష్ నాథ్ ప్రీ ప్రైమరీ విద్యార్థుల యాక్టివిటీస్ వస్తువులు బహూకరించారు.

# స్ఫూర్తి

విద్యావిషయక మాస పత్రిక

కలియుగాబ్ది-5127, శాలివాహన శక సం. 1947, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆశ్వయుజ-కార్తీక మాసములు

సంపుటి : 50, సంచిక : 10, అక్టోబర్ 2025, పుటలు : 36, వెల : రూ.18/-

**సంపాదకులు**

**డా॥ అన్నదానం వేం. సుబ్రహ్మణ్యం**

**ప్రచురణ కర్త**

**పసర్తి మల్లయ్య**

**సంపాదకమండలి**

రావుల సూర్యనారాయణ

రమా విశ్వనాథన్

గోపగోని సప్తగిరి

అన్నావఝ్జల శ్రీనాథ్

పతకమూరి శ్రీనివాసరావు

**ముద్రణ**

సాయి లిఖిత ప్రింటర్స్, ఖైరతాబాద్,

హైదరాబాద్-500004

**డి.టి.పి.**

**స్ఫూర్తి గ్రాఫిక్స్**

శ్రీ సరస్వతీ విద్యాపీఠము,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500004

**స్ఫూర్తి చందా వివరములు**

**స్ఫూర్తి వార్షిక చందా రూ॥ 220-00 లు**

యం.ఓ./ డి.డి. ద్వారా

శ్రీ సరస్వతీ విద్యాపీఠము పేరున

క్రింది చిరునామాకు పంపగలరు.

**శ్రీ సరస్వతీ విద్యాపీఠము**

ఇ.నెం. 6-3-597/ఎ/7,

వేంకటరమణ కాలనీ,

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.

**ఫోన్ : 040-23316160, 23316084**

**e - mail :sphoortissvp@gmail.com**

## అమృతవాణి

శ్లో॥ యద్దూరం యద్దురారాధ్యం యచ్చ దూరే వ్యవస్థితమ్ ॥

తత్సర్వం తపసా సాధ్యం తపోహి దురతిక్రమమ్ ॥

**భావము :** ఏదైనా వస్తువు ఎంత దూరంగా ఉన్నప్పటికీ అది లభించడం కష్టమైనప్పటికీ అది మనకు అందనంత యెత్తులో ఉన్నప్పటికీ కఠోర పరిశ్రమ మరియు తపస్సు ద్వారా దానిని పొందవచ్చును.

## ఈ సంచికలో . . .

| | |
|---|---|
| సంపాదకీయము | ... 04 |
| ఆర్.యస్.యస్. @ 100 | ... 05 |
| నేనే దేశం - దేశమే నేను | ... 07 |
| తీరొక్క పూవై | ... 09 |
| భగినీ హస్త భోజనం | ... 11 |
| సంస్థానాల విలీన కర్త సర్దార్ పటేల్ | ... 13 |
| భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ | ... 15 |
| చిత్రమాలిక | ... 17 |
| శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు | ... 21 |
| లోకజ్ఞానం - 203 | ... 22 |
| వయసు పెరుగుతోంది .... మనసు ఎదుగుతోందా? | ... 23 |
| పౌరుల కర్తవ్యం | ... 25 |
| శివాజీ మెచ్చిన యువకుని సత్య నిష్ఠ | ... 27 |
| సదాచారం... నైతిక విద్యాహారం ... | ... 29 |
| శ్రీ సరస్వతీ శిశుమందిరాల వికాస చరిత్ర | ... 31 |
| వార్తలు | ... 33 |

Printed & Published by **Pasarti Mallaiah** on behalf of Sri Saraswathi Vidya Peetham (Owner) and Printed at **Sai Likhita Printers**, # 6-2-959, D.B.Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd - 500004 and Published at Sri Saraswathi VidhyaPeetham, # 6-3-597/A/7, Venkataramana Colony, Khairatabad, Hyd - 500004 (Publication Place) Editor : **Dr. Annadanam Venkata Subrahmanyam.**

# రాక్షస మనస్తత్వం అంతరించాలి

**శ**రన్నవరాత్రులు ప్రారంభమైనాయి. జగన్మాత ఒక్కొక్క రోజు ఒక్కొక్క అవతారాన్ని ధరించి దుష్ట సంహారం శిష్ట రక్షణ చేసింది. అయితే జగన్మాత ఇతర దేవీ దేవతల ఆయుధాలను, శక్తిని క్రోడీకరించుకొని ఒక సంఘటనా శక్తిగా అవతరించి మాత్రమే రాక్షస సంహారం చేయగలిగింది. ఇది సమాజానికొక గుణపాఠం. శక్తివంతమైన సమాజమే దురాక్రమణలను చేసే శత్రువులను ప్రతిఘటించగలుగుతుంది. ఆసురీశక్తి మీద దైవీ శక్తి విజయం సాధించి దశమినాడు విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. అయితే ఆనాటికి అప్పటి రాక్షస శక్తి నశించింది. దుష్టశక్తి విజృంభిస్తున్నప్పుడు దానిని అణచివేయడానికి సజ్జన శక్తి అప్రమత్తమై ఉండాలి. తగిన చర్యలు చేబట్టాలి.

శుంభ నిశుంభులు, రక్తబీజ, రక్తదంతులు, మహిషాసురుడు వంటి రాక్షసులైతే చనిపోయారు గాని ఆ రాక్షస స్వభావం అంతమైందని మనం చెప్పలేము. రాక్షస స్వభావం నేటికీ బడబాగ్నిలా దాగి ఉంది. సమాజాన్ని అస్తవ్యస్తం చేయడానికి పొంచి చూస్తోంది.  విజయదశమి నాడు సీమోల్లంఘనం చేసే పరిపాటి ఉంది. దాని అర్థం పొలిమేరలకు వెళ్ళి సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయా? లేదా? పరిశీలించుకోవాలనే హెచ్చరిక అది. సురక్షితం చేసుకోమని సూచనకూడ.

నేడు భారతదేశ సరిహద్దు దేశాల్లో అశాంతి, అనిశ్చితి విలయతాండవం చేస్తోంది. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ లలో డీప్‌స్టేట్ ప్రభావం కారణంగా జెన్ జీ అంటే ఆ దేశాల్లోని యువత పెడదారి పట్టి తిరుగుబాటు చేస్తూ దేశాలను అగ్ని గుండం గా మార్చారు. మియన్మార్, పాకిస్థాన్ వంటి దేశాల్లో కూడ పరిస్థితులు గందరగోళంగానే ఉంటున్నాయి. సరిహద్దు దేశాలావిధంగా ఉండటం మన దేశానికంత సురక్షితంకాదు. అయినా జాగరూకతతో ఉంటే భయపడనవసరం లేదు.

భారతదేశానికి శతాబ్దాల నుండి బాహ్య శత్రువులకంటె ఆంతరంగిక శత్రువుల వల్లనే ప్రమాదమెక్కువ అని చరిత్ర తెలియజేస్తోంది. ఆ ఆంతరంగిక శత్రువులనే రాక్షసాంశగా భావించవచ్చు. సమాజంలో వేర్పాటు భావాలను, మనోభేదాలను, విద్వేషాలను సృష్టించి పరస్పరం కలహించుకుంటుంటే చూసి పైశాచిక ఆనందాన్ని పొందే కుట్ర నేడు మన భారత్‌లో జరుగుతున్నదనే అనుమానం రాక తప్పదు.

భారతదేశంలో ప్రజాస్వామ్యం నశించి పోతోంది. దీనిని కాపాడటానికి మీరు రండని ఒక నాయకుడు విదేశాన్ని యీదేశానికి ఆహ్వానిస్తున్నాడు. అంటే ఇక్కడ తన మద్దతుంటుందనేగా! భారత ఆర్థికాభివృద్ధి రేటు పెరుగుతుంటే దానిని డెడ్ ఎకానమీ అని కడివెడు పాలలో ఉప్పురాయి వేసినట్లుగా మాట్లాడతాడు. గృహ మంత్రి తల నరికి వేయాలని ఒకరంటే రాజకీయల కేమాత్రం సంబంధం లేని 90 యేళ్ళ పై చిలుకు మాతృమూర్తిని, సాక్షాత్తు ప్రధాన మంత్రి తల్లిని బహిరంగ సభలో నీచాతి నీచంగా నిందించే దుస్థితికి పాల్పడుతుంటారు. బడాబడా నాయకుల సమక్షంలో అలా జరిగినా వాళ్లు ఖండించలేదు సరిగదా! నిమ్మకు నీరెత్తినట్లున్నారు. ఇవన్నీ దేనికి సంకేతాలు. వైవిధ్యంలోని యేకత్వాన్ని దర్శించలేని యీ గ్రుడ్డి వారు కులాల పేరుతో, ప్రాంతాల పేరుతో విభేదాలు విజృంభించేలా ప్రవర్తనలుండటం మన కళ్ళముందు కనిపిస్తోంది.

పదే పదే అబద్ధాన్ని చెప్తుంటే అదే నిజమై కూర్చుంటుందట. ఈ మధ్య మన దేశంలో ఎన్నికల సంఘాన్ని లక్ష్యాన్ని చేసుకొని ఓటు చోరీ జరిగిందంటూ రాజ్యాలను చుట్టబెడుతున్న రాజకీయ నాయకులు తయారై ప్రజల మనస్సులను కలుషితం చేస్తూ కన్ఫ్యూషన్ క్రియేట్ చేసే పన్నాగం పన్నుతున్నారు.

నేడు చరిత్ర గుణపాఠాలు తెలిసిన భారతీయులున్నారు. వారంతా నిజానిజాలు తెలుసుగోగలిగేవారే. వాళ్ళ అభివృద్ధిని వాళ్ళు చేజేతులారా నాశనం చేసుకునే వారు కాదు. దేశంలో అశాంతిని, అలజడిని నేటి తరం కోరుకోవడం లేదు.  భావితరాల ఉజ్వల భవిష్యత్తుని ఆశించే విధంగా నేటితరం ఆలోచించవలసిన శుభ సమయమిది. ★

# ఆర్.యస్.యస్. @100

**ఆర్.** యస్.యస్. శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఢిల్లీలో జరిగిన మూడు రోజుల వాఖ్యానమాలలో ప.పూ. సరసంఘ చాలక్ జీ చేసిన ప్రసంగంలోని ప్రధాన సూత్రాలనీ వ్యాసంలో అందిస్తున్నాము.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మూడు రోజుల ఉపన్యాస శ్రేణిలో మొదటి రోజున, ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ మాట్లాడుతూ, భారతదేశాన్ని కేంద్రంగా ఉంచుకుని ఆర్ఎస్ఎస్ ఏర్పడిందని, భారత్‌ను విశ్వగురువు చేయడంతోనే దానికి సార్ధకత ఏర్పడుతుందని అన్నారు. సంఘ ప్రార్థన ముగింపులో చెప్పే **"భారత్ మాతా కీ జై"** నుంచి సంఘ్ పనికి ప్రేరణ లభిస్తుంది. సంఘ్ ఉత్థాన ప్రక్రియ నెమ్మదిగా, దీర్ఘంగా ఉంటుంది.. అది నేటికీ కొనసాగుతోంది అని తెలిపారు. సంఘ హిందూ అనే పదాన్ని ఉపయోగిస్తున్నప్పటికీ, దాని సారాంశం 'వసుధైవ కుటుంబకం' అని ఆయన అన్నారు. ఈ క్రమమైన అభివృద్ధిలో సంఘ్ గ్రామం, సమాజం, దేశాన్ని తనదిగా భావిస్తుందని చెప్పారు. సంఘ్ పని పూర్తిగా స్వయంసేవకులే నిర్వహిస్తారు. కార్యకర్తలే కొత్త కార్యకర్తలను సిద్ధం చేస్తారు అని తెలిపారు.

దేశం అంటే నిర్వచనం అధికారం ఆధారంగా ఉండదు. గతంలో మనం పరాధీనులమైనప్పటికీ మనకు ఒక దేశం ఉంది. నేషన్' అనే ఆంగ్ల పదం 'దేశం'తో ముడిపడి ఉంది, అయితే భారత దేశం అనే భావన అధికారంతో ముడిపడి లేదు.

దేశంలో స్వాతంత్ర్య పోరాటం, తదనంతరం జరిగిన భావజాల అభివృద్ధి గురించి మాట్లాడుతూ, 1857లో స్వాతంత్ర్యం కోసం జరిగిన మొదటి ప్రయత్నం విఫలమైందని, అయితే అది కొత్త చైతన్యాన్ని మేల్కొలిపిందని అన్నారు. ఇంకా–

ఆ తర్వాత ఒక ఉద్యమం మొదలైంది. కొంతమంది వ్యక్తులు మనల్ని ఎలా ఓడించగలరు? భారతీయులకు రాజకీయ అవగాహన లేదని మరో ఆలోచన వచ్చింది. ఈ అవసరం నుంచే కాంగ్రెస్ ఉద్భవించింది, కానీ స్వాతంత్ర్యం తర్వాత అదీ సైద్ధాంతిక జ్ఞానోదయం కలిగించే పనిని సరిగ్గా చేయలేక పోయింది. ఇది ఆరోపణ కాదు, వాస్తవం, స్వాతంత్ర్యం తర్వాత, ఒక ఆలోచనా స్రవంతి సామాజిక దురాచారాలను నిర్మూలించడంపై దృష్టి సారించగా, మరొక ఆలోచనా స్రవంతి మన మూలాలకు తిరిగి రావడం గురించి మాట్లాడింది. స్వామి దయానంద సరస్వతి, స్వామి వివేకానంద ఈ ఆలోచనా స్రవంతిని ముందుకు తీసుకెళ్లారు అని చెప్పారు.

సమాజంలోని చెడులను తొలగించకుండా చేసే అన్ని ప్రయత్నాలు అసంపూర్ణంగా ఉంటాయని పరమపూజనీయ డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, ఇతర మహానుభావులు విశ్వసించారని భాగవత్ అన్నారు.

"మళ్లీ మళ్లీ బానిసత్వంలోకి పడిపోవడం సమాజంలో లోతైన లోపాలు ఉన్నాయని సూచిస్తుంది. ఇతరులకు సమయం లేనప్పుడు, తాను స్వయంగా ఈ దిశలో పని చేయాలని హెడ్గేవార్ నిర్ణయించుకున్నారు. 1925లో సంఘాన్ని స్థాపించడం ద్వారా, మొత్తం హిందూ సమాజాన్ని వ్యవస్థీకరించే లక్ష్యాన్ని ఆయన తన ముందు ఉంచుకున్నారు" అని తెలిపారు.

సర్ సంఘ్‌చాలక్ హిందూ అనే పదం సారాంశాన్ని వివరిస్తూ, 'హిందూ' అనే పదానికి అర్థం కేవలం మతపరమైనది కాదని, అది దేశం పట్ల బాధ్యత సూచించే ఒక భావం అని స్పష్టం చేశారు.

"ఈ పేరును (హిందూ) ఇతరులు పెట్టారు. కానీ మేము ఎల్లప్పుడూ మమ్మల్ని మానవ శాస్త్ర దృక్పథం నుండి

చూసుకున్నాము. మనిషి, మానవత్వం, సృష్టి ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని, అవి ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయని మేము నమ్ముతాము. హిందూ అంటే చేరిక. చేరికకు పరిమితులు లేవు" అని అన్నారు. ఇంకా, "ఎవరైతే నమ్ముతున్న దాని మీద విశ్వాసం ఉంచి, స్వంత మార్గాన్ని అనుసరిస్తూ ఇతరులను మార్చకుండా ఉంటారో అతడే హిందువు అని తెలిపారు.

"ఇతరుల విశ్వాసాలను గౌరవించండి, వారిని అవమానించకండి. ఈ సంప్రదాయం, సంస్కృతిని కలిగి ఉన్నవారు హిందువులు, మనం మొత్తం హిందూ సమాజాన్ని ఏకం చేయాలి. హిందూ అంటే అందరూ అని కాదు, అది అస్సలు కాదు. 'హిందూ" అంటే అందరినీ కలుపుకుని వెళ్లడం." అని చెప్పారు.

భారతదేశం స్వభావం సంఘర్షణ కాదు, సమన్వయం అని ఆయన అన్నారు. భారత్ ఐక్యతా రహస్యం దాని భౌగోళికం, వనరులు, ఆత్మపరిశీలన సంప్రదాయంలో ఉందని చెప్పారు.

"మేం సత్యన్వేషణను బాహ్యంగా కాకుండా అంతర్గతంగా చేశాము, సత్యాన్ని కనుగొనడానికి మేము లోపలికి చూశాము. ఆ అన్వేషణ అందరి లోనూ ఒకటే తత్త్వం ఉంటుందనే విషయాన్ని మాకు నేర్పింది. అది వివిధ రూపాల్లో ఉంటుందని తెలిసి వచ్చింది. అందుకే భారతమాత, మన పూర్వీకులు మనకు పూజనీయులు" అని చెప్పారు.

భారతమాతను, తన పూర్వీకులను నమ్మేవాడే నిజమైన హిందువు అని మోహన్ భాగవత్ అన్నారు. కొంతమంది తమను తాము హిందువులుగా భావిస్తారు, మరికొందరు తమను తాము భారతీయులు లేదా సనాతనీయులు అని పిలుస్తారు. పదాలు మారవచ్చు, కానీ వాటి వెనుక భక్తి, శ్రద్ధల భావన ఉంది. భారత్ సంప్రదాయం, జన్యువులు ప్రతి ఒక్కరినీ కలుపుతాయి అన్నారాయన.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గుర్తింపు అని చెబుతూ, డాక్టర్ భాగవత్ గతంలో దీనికి దూరంగా ఉన్న ప్రజలు కూడా క్రమంగా తమను తాము హిందువులుగా పిలుచుకోవడం ప్రారంభించారు. ఎందుకంటే జీవన నాణ్యత మెరుగుపడినప్పుడు, ప్రజలు తమ మూలాలకు తిరిగి వస్తారు. మీరు హిందువుగా ఉండాలని మేము చెప్పడం లేదు. మీరు హిందువు అని మేము మీకు చెప్తాము అని అన్నారు. ఈ పదాల వెనుక ఎటువంటి అర్థం లేదు.. విషయం ఉంది. ఆ విషయంలో భారతమాత పట్ల భక్తి ఉంది, పూర్వీకుల సంప్రదాయం ఉంది. భారతదేశ ప్రజల జన్యువులు 40 వేల సంవత్సరాల క్రితం నుండి ఒకేలా ఉన్నాయి. హిందువులు అని తమను తాము పిలుచుకునే వారు వారి జీవితాన్ని మెరుగుపరుచు కోవాలి. అలా పిలుచుకోని వారు కూడా పిలుచు కోవడం ప్రారంభిస్తారు. ఏదో ఒక కారణం చేత మర్చిపోయిన వారు కూడా మళ్లీ గుర్తు చేసుకుంటారు అని చెప్పారు.

ఇంకా ఇలా అన్నారు: మనం చేయాల్సింది ఏమిటంటే మొత్తం హిందూ సమాజాన్ని ఏకం చేయడం. మనం హిందూ దేశం అని చెప్పేటప్పుడు, మనం ఎవరినీ వదిలిపెట్టడం లేదు. సంఘ్ ఒకరికి వ్యతిరేకంగా, వారికి స్పందనగా ఉద్భవించలేదు. హిందూదేశానికి అధికారంతో ఎలాంటి లావాదేవీలు లేవు.

సంఘ పని విధానాల గురించి ఆయన మాట్లాడుతూ సమాజ అభ్యున్నతి కోసం, సంఘ్ రెండు మార్గాలను అనుసరిస్తుందని అన్నారు. మొదటిది, మానవులను అభివృద్ధి చేయడం, రెండవది, వారితో సమాజం కోసం పనిచేయించడం అని చెప్పారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఒక సంస్థ. ఈ సంస్థ పని మానవాభివృద్ధికి కృషి చేయడం. సంఘ్ స్వయంసేవకులు వివిధ రంగాలలో పనిచేస్తారు, కానీ సంస్థ వారిని నియంత్రించదు. సమాజంలో సంఘ్ పట్ల వ్యతిరేకత, నిర్లక్ష్యం ఉన్నా కానీ సంఘ్ సమాజాన్ని తనదిగా భావించింది అని తెలిపారు.

**వ్యక్తిగత అంకితభావంతో సంఘ్ నిర్వహణ**

"సంఘ్ ప్రత్యేకత ఏమిటంటే అది బాహ్య వనరులపై ఆధారపడదు, కానీ స్వయంసేవకుల వ్యక్తిగత అంకితభావంతో నడుస్తుంది. 'గురు దక్షిణ' అనేది సంఘ్ పని వ్యవస్థలో అంతర్భాగం. దీని ద్వారా ప్రతి స్వయంసేవకుడు సంఘ్ పట్ల

(తరువాయి భాగం 8వ పుటలో...)

పద్యం-పరమార్థం

# నేనే దేశం - దేశమే నేను



✍ ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి

దేశానికి వ్యకికీ అద్వైత భావన (రెండూ ఒకటే అన్న భావన) ప్రతి భారతీయుడు తెలుసుకోవాల్సిన అవసరమున్నది. జీవాత్మలో పరమాత్మ ఉన్నాడనే భావన ఎటువంటిదో ఇది అటువంటిదే.

ఆధునిక కాలంలో ఈ భావన భారతీయుల్లో బాగా నాటిన మహనీయుడు స్వామి రామతీర్థ. ఆయన ఆంగ్లంలో చెప్పిన ఒక కవితకు తెలుగు సేత ఇది.

అఖండ భారతమే నేను. భారతవర్షమే నా శరీరము. కన్యాకుమారి అగ్రమే నా పాదభూమి. హిమాలయమే నా శిరము. గంగాసింధు బ్రహ్మపుత్రా నదులు నా శిరము నుండి యే ప్రవహించుచున్నది. కోరమండలు-మలబారులు నా పదద్వయము. ప్రాక్ పశ్చిమములే నా రెండు చేతులు. ఈ నా రెండు చేతులను చాచి విశ్వమానవ కోటిని కౌగిలించుకొందును. దీనికై అనంతాకాశము నిరీక్షించుచున్నది. నేను నడచినచో భారతమే నడచి నట్లుందును. నేను ఊపిరి పీల్చినచో భారతమే ఊపిరి పీల్చును. నేను మాటలాడినచో భారతమే మాటలాడినటులుండును. నేనే భారతము. భారతమే నేను. నేనే శంకరుడను. నేనే సర్వేశ్వరుడను.

ఇది స్వామిరామతీర్థ ఆంగ్లములో వ్రాశారు. ఆ ఆంగ్లానికి తెలుగుసేత డా॥ఓగేటి అచ్యుతరామశాస్త్రి గారిది. ఈ ప్రభావంతో వారు సొంతంగా వ్రాసిన ఈ పద్యం చూడండి!

సీ॥ **భారతదేశము నాయది భరత సుతుడు**
**ధరణి జననికి నాకు నద్వైత మెరపు**
**సాగరము బోలు గంభీర సరళినాది**
**తుహినగిరి వోలె ధైర్యవంతుడను నేను.**
**నాది భారతదేశం. నేను భారతమాత పుత్రుడను.**

ఈ భూమాతకు నాకు భేదం లేదు. సముద్రం వంటి చెక్కుచెదరని లోతైన మార్గంనాది. హిమాలయమంతటి ధైర్యవంతుడను నేను అంటున్నారు కవి; అనుకోండి అంటున్నారు కవి.

అద్వైతం అంటే రెండు కాదు ఒకటే అని అర్థం. ఈ శంకరులే మొదటిసారిగా అద్వైతం ప్రస్థాపించారు. ఈ ప్రపంచమంతా పరమాత్మ స్వరూపమే అని, ఏక మే వ అద్వితీయం బ్రహ్మ అనే నిర్వచనం ఆధారంగా నిలిచిందని అంటారు. రెండులేవు; ఉన్నది ఒకటే అని సిద్ధాంతము. ఆ ఒక్కడు పరమాత్మ.

ఈ విశ్వాన్ని విభజించి చూడరాదు; అంతా పరమాత్మ మయంగా చూడాలని అంటారు. స్వామి శివానంద సరస్వతుల దగ్గరికి వచ్చి ఒక శిష్యుడు మీరు దేవుణ్ణి చూశారా! అని అడిగాడు.

అందుకు శ్రీస్వామి వారు దేవుడు తప్ప నాకింకేం కనిపించడం లేదన్నారు. నీరు-నిప్పు-ఆకాశం-గాలి-భూమి అనే పంచభూతాలు, సర్వజీవులు అన్నీ ఆ పరమాత్మ స్వరూపమే అని అద్వైతం చెబుతున్నది.

మనం ఏ దేశంలో పుట్టినామో ఆదేశంతో, అక్కడి మట్టితో, గాలితో, నీరుతో, నిప్పుతో అభేదాన్ని పాటించే మానసిక స్థితిలో ఉండాలని స్వామి రామతీర్థ కవిత సందేశమిస్తున్నది. ఆది శంకరుల అద్వైత సిద్ధాంతాన్ని ఈ విధంగా అన్వయించుకోవడం దేశభక్తికి పరాకాష్ఠ.

ఆ మార్గాన్ని అపూర్వంగా అనుసరిస్తూ తమ కావ్యాల ద్వారా, ప్రసంగాల ద్వారా, వ్యాఖ్యానాల ద్వారా, బోధనల ద్వారా నిరంతరం కృషిచేసిన మహనీయుడు రాష్ట్రకవి డా॥ఓగేటి అచ్యుతరామ శాస్త్రి. ప్రస్తుత పరిస్థితుల్లో శౌర్య ధైర్యాలతో పరశురామునిలా నిలబడండి అని పిలుపు నిస్తున్నారు వారు. ★

(6వ పుట తరువాయి భాగం ...)

తన విశ్వాసాన్ని, నిబద్ధతను వ్యక్తం చేస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. మన ఆలోచనలు, విలువలు, ప్రవర్తనను సరిగ్గా ఉంచుకోవడానికి మనం ప్రయత్నిస్తాం. స్వయంసేవకుల గురించి మనం ఆలోచించాలి. వారు సంఘ్ గురించి ఆలోచి స్తుంటారు. భారతదేశంలో సమూహాలను సృష్టించడం కాదు, మనమందరం కలిసి రావాలి. మనం అందరినీ సంఘటితం చేయాలి..” అని తెలిపారు.

## రెండవ రోజు

### అంతర్జాతీయ వాణిజ్యం స్వచ్ఛందంగా మాత్రమే జరగాలి, ఒత్తిడితో కాదు..!

సమాజం, జీవితం మధ్య సమతుల్యత ధర్మం అవుతుంది అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. ఇది ఏదైనా అతివాదం నుంచి మనల్ని కాపాడుతుంది. భారతీయ సంప్రదాయం దీనిని మధ్యే మార్గం అని పిలుస్తుంది. ఇది నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైనది. ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచేందుకు, సామాజిక మార్పు ఇంటి నుండే ప్రారంభం కావాలి. దీనికోసం సంఘ పంచ పరివర్తన్ సూచించింది. అవి కుటుంబ జ్ఞానోదయం, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, స్వీయ- సాక్షాత్కారం (స్వదేశీ), పౌర విధుల నిర్వహణ, స్వావలంబన భారతదేశం కోసం స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వండి. భారత్ అంతర్జాతీయ వాణిజ్యం స్వచ్ఛందంగా మాత్రమే జరగాలి. ఎటువంటి ఒత్తిడితో కాదు.

### సంఘ పనితీరు

స్వచ్ఛమైన సాత్విక ప్రేమ, సమాజం పట్ల భక్తిపై ఆధారపడి సంఘం పని చేస్తుందని మోహన్ భాగవత్ జీ అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. సంఘ స్వయం సేవకులు ఎటువంటి వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆశించరు. ఇక్కడ ఎటువంటి ప్రోత్సాహకాలు ఉండవు. బదులుగా ప్రోత్సాహకాలను నిరుత్సాహ పరిచేవి ఎక్కువగా ఉంటాయి. స్వయంసేవకులు సామాజిక సేవలో ఆనందాన్ని అనుభవిస్తూనే పని చేస్తారు. ఈ సేవ ద్వారా జీవితం సార్థకమవుతుంది. సజ్జనులతో స్నేహం చేయడం, దుర్మార్గులను విస్మ రించడం, ఎవరైనా మంచి చేసినప్పుడు ఆనందాన్ని వ్యక్తపరచడం, దుష్టుల పట్ల కూడా కరుణ చూపడం – ఇది జీవితానికి సంఘ్ ఇచ్చే విలువ.

### హిందూత్వ అంటే..

హిందూత్వ ప్రాథమిక భావన గురించి ఆయన మాట్లాడుతూ, హిందూత్వం అంటే సత్యం, ప్రేమ, స్వంతం అని అన్నారు. దీని గురించి వారి మాటల్లో.. మన ఋషులు, సాధువులు జీవితం మనకోసం కాదని మనకు బోధించారు. అందుకే భారతదేశం ఒక పెద్ద అన్నయ్యలా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే పాత్రను, పోషించాల్సి వచ్చింది. ఇక్కడే ప్రపంచ సంక్షేమం అనే ఆలోచన పుడుతుంది.


### ప్రపంచం ఎటు వైపు వెళుతుందంటే..

ప్రపంచం మతోన్మాదం, అసమ్మతి, అశాంతి వైపు పయనిస్తోందని సర్ సంఘచాలక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది వారి మాటల్లో.. గత 350 సంవత్సరాలలో, వినిమయతత్త్వం, భౌతికవాద దృక్పథం కారణంగా మానవ జీవితానికి భద్రత కొరవడింది. శ్రమ తెలియని పని, వివేకరహిత ఆనందం, చరిత్రస్పృహ లేని జ్ఞానం, నైతికత లేని వాణిజ్యం, మానవత్వం లేని సైన్స్, త్యాగం లేని ధర్మం, సిద్ధాంతాలు లేని రాజకీయాలు సమాజంలో అసమతుల్యతను మరింతగా పెంచాయి.

### ధర్మపథాన్ని అనుసరించాలి.

నేడు ప్రపంచంలో సమన్వయం లోపించిందని ప్రపంచం తన దృక్పథాన్ని మార్చుకోవాల్సి వస్తుందని సరసంఘ్ చాలక్ అన్నారు. వారి మాటల్లో.. ప్రపంచం ధర్మపథాన్ని అనుసరించాల్సి ఉంటుంది. ధర్మం పూజలు, ఆచారాలకు అతీతమైనది. ధర్మం అన్ని రకాల మతాల కంటే ఉన్నతమైనది. ధర్మం మనకు సమతుల్యతను బోధిస్తుంది. మనతో పాటుగా సమాజం, ప్రకృతి సైతం మనుగడ సాగించాలి. తీవ్రవాదం నుండి మనల్ని రక్షించే మధ్యేమార్గం ధర్మం. ధర్మం అంటే గౌరవంగా, సమతుల్యతతో

(తరువాయి భాగం 10వ పుటలో...)



# తీరొక్క పూవై

– తేజస్విని

శరద్రుతువు ప్రారంభమైంది. శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నాయంటే చాలు తెలంగాణలో బతుకమ్మ రూపంలో గౌరమ్మ కొలువు తీరుతుంది. మహిళలు భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అర్చించి వాలాడింపు (నిమజ్జనం) చేస్తారు. ఇలా మహర్నవమి వరకు ఆరాధిస్తారు. బతుకమ్మ పండుగ అంటే శక్తి పూజ. స్త్రీపూజ, ప్రకృతి ఆరాధన, ప్రకృతి పోషణ, పరిరక్షణగా భావించవలసి ఉంటుంది. ఈ పండుగలో పర్యావరణ సృహ ఉంది. ఆరోగ్య స్పృహ సమరసతా స్పృహ అంతరార్థంగా గోచరిస్తుంది. శ్రావణ భాద్రపదాల్లో కురిసే వానల్లో ప్రకృతి కాంత జలకాలాడి పరవశిస్తూ ముసిముసి నవ్వులను చిందిస్తున్నట్లు అందమైన పుష్పాలను వికసిస్తూ అలరారుతుంటుంది. మొక్కలు దట్టంగా పెరుగుతాయి. అందంగా పుష్పిస్తాయి. ఇవన్నీ ఔషధీగుణాలు కలిగిన మొక్కలే. బతుకమ్మలో పేర్చే పుష్పాలన్నీ ఓషధ గుణాలున్నవే.

మహాలయామావాస్య అయినప్పటికీ పితృకార్యాలు పూర్తి అయిన తరువాత సాయం సమయాల్లో మహిళలు శుచియై వెదురు బద్దల సిబ్బి (పళ్లెం) పై మానవ ప్రయత్నం లేకుండా సహజ సిద్ధంగా పూసే గునుగు, గోరింట, తంగేడు, కట్ల, రుద్రాక్ష పూలతో పాటు బంతి, చేమంతి, గులాబీలను కూడా చేర్చి అందంగా గోపురాకారంలో బతుకమ్మను పేర్చుతారు. ఇందులో ఎక్కడా ప్లాస్టిక్‌ను వాడరు. ఈ పూలన్నీ ప్రకృతి సౌందర్యానికి ప్రతీకలు. ఇంతిని అంటే స్త్రీని పుష్పంతో పోల్చడం కవి సమయం. ఈ బతుకమ్మలో పేర్చే ప్రతి పువ్వు స్త్రీ అయితే అటువంటి స్త్రీని దేవతా స్వరూపంగా భావించాలనే భావ వ్యాప్తి గూడ పండుగలోని అంతరార్థం. అప్పుడు సమాజంలో వికృతులు, విపరీత ధోరణులు తలెత్తవు. స్త్రీలను గౌరవించాలనే భారతీయ భావన ఆ విధంగా ఆవిష్కరింపబడుతోంది. తాము బతికుండాలి. తమ సంతానం బతికుండాలి. కుటుంబం, సమాజమంతా బతికుండాలనే భావనతో గౌరమ్మ తల్లిని బతుకమ్మ రూపంలో పూజిస్తారు. తమకు సర్వకాల సర్వావస్తలలోను ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ రక్షించమని కోరుతూ ఔషధ గుణాలు కలిగిన సమాహార పుష్ప స్వరూపిణియైన బతుకమ్మను కొలుస్తారు.

బతుకమ్మను పేర్చడం, కూర్చడం ఒక సృజనాత్మకతయే, అదొక గొప్పకళ. సౌందర్యా వహమైనది. నిత్యము దేవీ దేవతలను పూలతో పూజిస్తుంటే యీ తొమ్మిదిరోజులు పువ్వే ఒక దేవతగా ఆరాధింపబడటం, హిందుత్వం లోని గొప్ప విశేషత. నృత్యం దర్శయామి, గీతం శ్రావయామి అంటూ దేవతలను సంతోష పెడుతుంటారు. ఇరుగింటి, పొరుగింటి వారు, కొత్తవారందరూ తర తమ భేదాలు మరచి బతుకమ్మ చుట్టూ చేరి మండలాకారంలో లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ నెమ్మదిగా అడుగులు వేస్తూ ఆడతారు. బతుకమ్మ జీవిత చరిత్రతో పాటు సమకాలీన, భూతకాలీన చరిత్రలో సామాజిక విషయాలను కూడ పాటల్లో చేర్చుకుంటూ చైతన్యవంతమవుతారు. అవగాహన పెంచు కుంటారు. సామాజిక బాధ్యతను తెలుసు కుంటారు. కులభేదాలు తొలగిపోతాయి. సామరస్య జీవనాన్ని కలిగి ఉంటారు. ఇదంతా చూస్తుంటే ఇదొక లలిత కళల స్వరూపంగా గోచరిస్తుంటుంది. అంతకు ముందే పండి ఇంటికొచ్చిన చిరుధాన్యాలతో పప్పుదినుసులతో చేసిన ప్రసాదాలను పంచుకుం టారు. సామాజిక సంబంధాలు ఏర్పడతాయి, పెంపొందుతాయి.

పెళ్ళయిన మహిళలు తమ ఐదో తనం కాపాడాలని సత్సంతానం కలిగి చల్లగా బతకాలనే దీవెనలను కూడ బతుకమ్మ నుండి ఆశిస్తారు. కన్నె పిల్లలు మంచి మొగుడు రావాలనే ఆకాంక్షతో పాటు చల్లని బతుకునివ్వుమని ప్రార్థించడం కద్దు. సంస్కృతీ సాంప్రదాయాల నెలవు బతుకమ్మ. ★

(8వ పుట తరువాయి భాగం ...)

జీవించడం. దీనితోనే ప్రపంచ శాంతి స్థాపన జరుగు తుంది. ధర్మం అనేది మనల్ని సమతుల్య జీవితం వైపునకు నడిపిస్తుంది. అలా చేరుకున్న స్థితిలో వైవిధ్యాన్ని అంగీకరిస్తారు, ప్రతి ఒక్కరి ఉనికిని గౌరవిస్తారు. ఇదే ప్రపంచ ధర్మం, హిందూ సమాజం సంఘటితమై దీనిని ప్రపంచానికి అందించాలి.

**ప్రస్తుత ప్రపంచ పరిస్థితికి తరుణోపాయం**

ప్రస్తుతం ప్రపంచం ఉన్న పరిస్థితిలో శాంతి, పర్యావరణం, ఆర్థిక అసమానతలపై చర్చలు జరుగు తున్నాయి. పరిష్కారాలను కూడా సూచిస్తున్నారు. కానీ పరిష్కారం చాలా దూరంలో ఉందని అన్నారు. వారి మాటల్లో.. దీనికోసం ప్రతి ఒక్కరు నిజాయితీగా ఆలోచించాలి. జీవితంలో త్యాగం, బలిదానం రెండూ ఉండాలి. సమతుల్యమైన తెలివితేటలు, ధర్మ దృష్టిని పెంపొందించుకోవాలి.

**కష్టాల్లోనూ భారత్ సంయమనం**

కష్టాలు ఎదురైనప్పుడూ కూడా భారత్ సంయమనం పాటిస్తుందని అన్నారు. దీని గురించి.. మన కష్ట, నష్టాలను పట్టించుకోకుండా మనం ఎల్లప్పుడూ సంయమనం పాటించాం. మనకు హాని చేసినవారు సంక్షోభ సమయాల్లో ఉన్నప్పుడు వారికి మనం సహాయం చేసాం. వ్యక్తులు, దేశాల అహం నుంచి శత్రుత్వం పుడుతుంది, కానీ హిందూస్తాన్ అహంకా రానికి అతీతమైనది. భారతీయ సమాజం తన ప్రవర్తన ద్వారా ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలవాలి. నేడు సమాజంలో సంఘ శాఖ పట్ల నమ్మకం ఉంది. సంఘ్ ఏమి చెప్పినా సమాజం వింటుంది. ఈ నమ్మకం సేవ, సామాజిక అంకిత భావం ద్వారా సంపాదించుకున్నది.

**భవిష్యత్తుకు దిశానిర్దేశం**

భవిష్యత్తు దిశ గురించి సర్‌సంఘ్ చాలక్ మాట్లాడుతూ, సంఘ పని అన్ని ప్రదేశాలు, వర్గాలు, స్థాయిలకు చేరుకోవడమే సంఘ లక్ష్యం అని అన్నాడు. వారి మాటల్లోనే. సంఘ అది పనులు చేసే పెద్దమనుషులు కలిసి రావాలి. దీనితో సంఘ్ లాగా సమాజం కూడా వ్యక్తిత్వ నిర్మాణాన్ని. దేశభక్తిని పెంచుతుంది. దీనికోసం మనం సమాజం లోని ప్రతి మూలకు చేరుకోవాలి. భౌగోళిక దృష్టితో సంఘ శాఖ ప్రతి ప్రదేశానికి, ప్రతి వర్గానికి, సమాజంలోని ప్రతి స్థాయిని చేరుకోవాలి. సమాజం లోని పెద్దమనుషులను సంప్రదిస్తాం. వారిని ఒకరితో ఒకర్ని అనుసంధానిస్తాం. సమాజంలో సద్భావనను తీసుకురావడానికి, సమాజంలో అభిప్రాయాలను వ్యక్తీకరించేవారిని నిరంతరం కలవాలని సంఘం భావిస్తోంది. వీటి ద్వారా ఒక భావనను అభివృద్ధి చేసుకోవాలి. వారు తమ సమాజం కోసం పని చేయాలి, తాము హిందూ సమాజంలో భాగమనే భావనను పెంపొందించుకోవాలి. భౌగోళిక పరిస్థితు లకు సంబంధించిన సవాళ్లకు స్వంత పరిష్కారాలను కనుగొనాలి. బలహీన వర్గాల కోసం పనిచేయాలి. ఇలా చేయడం ద్వారా సంఘ్ సమాజ స్వభావంలో. మార్పు తీసుకురావాలని కోరుకుంటుంది. దండ యాత్రల కారణంగా భారత్‌లోకి కొన్ని మతాలు చొర బడ్డాయి. ఏదో కారణం చేత ఆ మతాల విశ్వాసాలను భారతీయుల్లో కొందరు స్వీకరించారు. వారు ఇక్కడి వారే, కానీ విదేశీ భావజాలం కారణంగా ఏర్పడిన దూరాలను తగ్గించాల్సిన అవసరం ఉంది. మనం ఇతరుల బాధను అర్థం చేసుకోవాలి. ఒకే దేశం, ఒకే సమాజం, ఒకే జాతిలో భాగమైన మనం, వైవిధ్యాలు ఉన్నప్పటికీ, సమానమైన పర్వేకులతో, ఉమ్మడి సాంస్కృతిక వారసత్వంతో ముందుకు సాగాలి. ఒ సానుకూలత, సామరస్యానికి చాలా అవసరం. దీనిలో కూడా మనం అవగాహనతో ఒక్కొక్క అడుగు ముందుకు వేయడం గురించి మాట్లాడుతున్నాము.

**ఇంటి నుంచి పంచ పరివర్తన్**

ప్రపంచంలో మార్పు తీసుకురావడానికి ముందు, మనం మన ఇంటి నుండే సామాజిక మార్పును ప్రారంభించాలి అని మోహన్ భాగవత్ అన్నారు. ఇంకా.. దీనికోసం సంఘ పంచ పరివర్తన్ సూచిం చింది. అవి కుటుంబ జ్ఞానోదయం, సామాజిక సామరస్యం, పర్యావరణ

(తరువాయి భాగం 12వ పుటలో...)

# భగినీ హస్త భోజనం



✍ డా॥ కోట లక్ష్మీ అన్నపూర్ణ

ఒక కొమ్మకు పూసిన పూలలాంటివారు తోబుట్టువులు. పూలకు బాధ కలిగితే కొమ్మకు బాధ కలిగినట్లు తమ బిడ్డలకేమైనా బాధ కలిగితే తల్లి మనస్సు కలవరపడుతుంది. తోబుట్టువులంతా ఐకమత్యంతో మెలిగితే తల్లి ఆనందిస్తుంది. సృష్టిలో ఏ ఇతర సంబంధాలు, రక్తసంబంధానికి సాటిరావు. పుట్టుకతోనే వచ్చే సంబంధం రక్తసంబంధం. దేహంలో ఊపిరి ఉన్నంతవరకు తమ తోబుట్టువులతో ఏ ఒకరికి ఆపద వచ్చినా తోబుట్టువుల గుండెలు విలవిలలాడతాయి. ఆ కష్టం తీరేవరకు వారు అనుభవించే వేదన వర్ణనాతీతం ఒక వయస్సుకు చేరుకున్నాక తల్లిదండ్రులు కాలగర్భంలో కలిసిపోతారు. అప్పుడు తల్లికి మారుగా అక్కచెల్లెళ్ళు, తండ్రికి మారుగా అన్నదమ్ములు నిలబడి అండదండలందించుకుంటూ అంతటి అప్యాయతా నురాగాలను పంచుకుంటారు. కొన ఊపిరి ఉన్నంతవరకు ఆ బంధం చెక్కుచెదరకుండా అలాగే కొనసాగుతుంది. మన ఆచారాలు, సంప్రదాయాలు అన్నీ బంధుత్వాలతో ముడిపడి ఉన్నదే. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా పెద్దవారికి నమస్కరించి మొదలు పెట్టడం వంటి ఆచారాలు సంస్కారాన్ని పెంచుతాయి. పెళ్ళి అయిపోయిన తరువాత బాధ్యతల్లో మునిగితే ఆడపిల్లలకు, తమకూ రాకపోకలు ఉంటేనే సంబంధాలు బాగుంటాయి. ఈ రాకపోకలు సాగాలంటే ఏదో ఒక కారణం ఉండాలి. ఆ కల్పించబడిన కారణాలే శుభకార్యాలు.

శుభకార్యాల పేరుతో ఆడపడచులు తప్పని సరిగా ఉండి తీరాలని చెప్పడం,అట్టి వేడుకలో ఆడపడచులకు పెద్దపీట వేయడం వంటివి మనకు తెలిసిన విషయాలే. అన్నదమ్ములకు ఆడపిల్లలు మంగళహారతి పట్టడం, ఆడపిల్లలకు సోదరులు, ఎంతో కొంత కానుకల రూపంలో ఇవ్వడం ఒక సంప్రదాయం. ఆడపిల్లలు నిండుమనస్సుతో



పుట్టింటి వారి సౌభాగ్యాన్ని ఎల్లప్పుడు కోరుకుంటూ ఉంటారు. ఒడిబియ్యం పోవడం,చలిమిడి పెట్టడం వంటి ఆచారాలు, సోదరీసోదరుల మధ్య బంధాన్ని మరింత పెంచడానికి దోహద పడే పండుగల ప్రత్యేకంగా కొన్ని ఉన్నాయి. అవి శ్రావణ పూర్ణిమ నాడు వచ్చే రక్షాబంధనం, కార్తీకమాసంలో వచ్చే భగినీ హస్త భోజనం పండుగలు. కార్తీక శుద్ధ విదియత నాడు భగినీహస్త భోజనం వస్తుంది. దీనినే హిందీలో భయ్యాదూద్ అని, సంస్కృతంలో భ్రాతృ విదియ అని, భగినీహస్తభోజనం అనీ అంటారు. భగినీ అంటే సోదరి అని అర్థం. ఉత్తర భారతదేశంలో ఈ పండుగ బహుళ ప్రాచుర్యాన్ని పొందిన పండుగ. తెలుగు వారిలో కూడా కొన్ని సంప్రదాయకుటుంబాల్లో భ్రాతృవిదియను పాటించడం కనిపిస్తుంది.

యముని చెల్లెలు యమున, యముడు క్షణం తీరికలేకుండా ఎప్పుడూ పనులలో మునిగిపోయివుంటాడు. యమున యముడిని తన ఇంటికి రమ్మని చాలా సార్లు ఆహ్వానించినప్పటికీ పనిభారం వల్ల యముడు యమున ఇంటికి వెళ్లలేకపోయాడు. చివరికి ఒకసారి యమున ఇంటికి వెళ్ళాడు. యమున పట్టరాని సంతోషాన్ని పొందింది. తను స్వయంగా యమునికి వడ్డించింది. యముడు సంతోషపడి నీకేమీ కావాలో కోరుకొమ్మని అడిగాడు. యముడు ఆతిథ్యం

స్వీకరించిన రోజులు కార్తీక శుద్ధ విదియ అప్పుడు యమున ఎవరైతే కార్తీక శుద్ధ విదియనాడు తను సోదరీమణుల చేతి భోజనాన్ని చేస్తారో వారు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి. వారికి అపమృత్యు బాధ ఉండకూడదు. సుఖసంతోషాలతో ఉండాలి. వడ్డించిన వారు కూడా కలకాలం సౌభాగ్యవతులై ఉండాలి. అని కోరుకుంది. ఇలా కోరడంలో యమునకు గల స్త్రీ సహజమైన సౌకుమార్యం, విశాల దృక్పథం,వ్యక్తమవుతున్నాయి. అక్కా చెల్లెళ్ల అనుబంధం పెరుగుతుంది. అదే విధంగా సోదరీమణుల ఇంటికి వెళ్ళి సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలను అందించి వారు అందించిన కానుకలను స్వీకరించి మనస్ఫూర్తిగా శ్రేయస్సును కోరుకుంటారు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. కానుకలనేవి పదోపరకో, కొద్దోగొప్పో ఎంతో కొంత శక్తి కొద్దీ సంతృప్తిగా ఇచ్చిపుచ్చుకోవడంగా ఉండాలి తప్ప ఎదుటివారిని పీడించి కానీ, ఎదుటివారిని తక్కువ చేసే విధంగా కానీ ఈ ఇచ్చిపుచ్చుకోవడాలు ఉండకూడదు. కొన్ని సంవత్సరాల పాటు పుట్టింటివారితో రాకపోకలు దూరమైతే బంధుత్వం తెగిపోతుందనే నియమం కూడా ఉంది కాబట్టి ఈ రకంగా రాకపోకల సంప్రదాయాన్ని మనవారు విధించారు.

ఈ విధంగా భ్రాతృవిదియ లేదా భగినీహస్తభోజనం అన్నా చెల్లెళ్ళ ప్రేమకు అద్దంపట్టే పండుగ. యముడు, యమునలతో ప్రారంభమైన ఈ ఆచారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ నేటికీ ప్రేమాభిమానాలను నిలబెడుతోంది. ఈ ఆచారాన్ని పాటిస్తే యముడి భయంకానీ, యమబాధలు కానీ ఉండవు. అకాల మృత్యుభయం, అపమృత్యుభయం ఉండవు. సిరిసంపదలకు లోటుండదు. ప్రేమాభిమానాలనే పెన్నిధి ముందు వేరేనిధులు ఎన్ని ఉన్నా తక్కువే మరి! ★

(10వ పుట తరువాయి భాగం ...**ఆర్.యస్.యస్. @ 100**)

పరిరక్షణ, స్వీయ గుర్తింపు, పౌర విధుల నిర్వహణ, పండుగల సమయంలో సంప్రదాయ దుస్తులు ధరించండి. మీ మాతృభాషలో వంతకం చేయండి. స్థానిక ఉత్పత్తులను గౌరవంతో కొనండి. మన పూర్వీకులు నవ్వుతూ ఉరికంబాలు ఎక్కారు, కానీ నేడు మనం దేశం కోసం అహర్నిశలు పాటుపడాల్సిన అవసరం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజ్యాంగం, నియమాలను పాటించాలి. ఏదైనా కవ్వింపు చర్యలు చోటు చేసుకుంటే టైర్లను కాల్చవద్దు.. రాళ్ళు విసరవద్దు.

ఇలాంటి కార్యకలాపాలను ఆసరాగా చేసుకొని చేసుకుని అసాంఘిక శక్తులు మనల్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తాయి. మనం ఎప్పుడూ రెచ్చి పోకూడదు. చట్టవిరుద్ధమైన పనులు చేయకూడదు. భారతదేశం స్వావలంబన దిశగా వృద్ధమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. దీని కోసం స్వదేశీకి ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రసంగం చివర్లో "చేసిన పనితో సాధించిన మడతను తన ఖాతాలో వేసుకోవాలని సంఘం కోరుకోదు. భారతదేశం పరివర్తన చెందడమే కాకుండా, యావత్ ప్రపంచంలో ఆనందం, శాంతిని నెలకొల్పే విధంగా ముందుకు సాగాలని సంఘ్ కోరుకుంటుంది అని సరసంఘ్ చాలక్ మోహన్ భాగవత్ తెలిపారు.

మూడు రోజుల ఉపన్యాస శ్రేణిలో చివరి రోజున, ఆర్ఎస్ఎస్ సరసంఘ్ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ సభాసదులు అడిగిన 200కు పైగా ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ★

**ఆర్మూర్ :–** ఆర్మూర్ పట్టణ కేంద్రము లోని టీచర్స్ కాలనీ లో గల శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజుని నేషనల్ స్పోర్ట్స్ డే గా జరుపు కుంటాము. ఈ వేడుకలో పిల్లలు యోగాసనాలు,



వివిధ నృత్యాలు, పిరమిడ్స్ చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థులకు విద్యతో పాటుగా ఆటలు కూడా చాలా అవసరం అని.. స్పోర్ట్స్ లో కూడా ముందు ఉండాలని పాఠశాల మేనేజ్‌మెంట్ భాను తేజ్ తెలియజేసారు. తదుపరి పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ సాయి ప్రియని పాఠశాల మేనేజ్‌మెంట్ భాను తేజ్ మరియు ప్రిన్సిపల్ వినోద్ కుమార్‌లు సన్మానించారు. ★


# సంస్థానాల విలీన కర్త సర్దార్ పటేల్



జయంతి: అక్టోబర్ 31

– విశ్వనాథన్

**భా**రతదేశ చరిత్రలో అక్టోబర్ 31 వ తేదీకి ప్రత్యేకత ఉన్నది. ఉక్కుమనిషి అని పిలుచుకునే సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి. ఈ సందర్భంగా ఆ మహనీయుని సేవలు గుర్తు చేసుకుందాం.



భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించినప్పటికీ, దేశం రాజకీయంగా పూర్తిగా ఏకమవ్వలేదు. 550కి పైగా చిన్న పెద్ద సంస్థానాలు స్వతంత్ర రాజ్యాలుగా ఉండేవి. వీటిలో కొన్నిటికీ తమ సైన్యం, తమ కరెన్సీ కూడా ఉండేది. వీటిని భారత యూనియన్‌లో చేర్చడం అత్యంత క్లిష్టమైన పని. ఈ మహత్తర కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించిన నేత సర్దార్ వల్లభభాయ్ పటేల్. అందుకే ఆయనను "భారత ఐక్యత శిల్పి" అని గౌరవంగా పిలుస్తారు.

**బాల్యం– విద్యాభ్యాసం:–**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 1875 అక్టోబర్ 31న గుజరాత్‌లోని నాడియాద్ గ్రామంలో జన్మించారు. ఆయన చిన్ననాటి నుంచి ధైర్యసాహసాలు, పట్టుదల ఎక్కువ. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన పటేల్ చిన్నప్పటి నుంచే చదువులో మంచి ఆసక్తి చూపించారు. మొదట స్థానిక పాఠశాలలో చదువుకున్నారు. తర్వాత గుజరాత్‌లోని పెటలాడ్, నాడియాద్ వంటి పట్టణాల్లో చదువుతూ మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు.

తరువాత న్యాయవాదిగా మారాలని సంకల్పించి లండన్‌కి వెళ్లి న్యాయశాస్త్రంలో చదువుకున్నారు. కష్టపడి చదివి అతి తక్కువ కాలంలో చదువు పూర్తి చేశారు. భారతదేశానికి తిరిగి వచ్చి గుజరాత్‌లోనే న్యాయవాదిగా పనిచేసి మంచి పేరు సంపాదించారు. ఈ కాలంలోనే ప్రజల సమస్యలు అర్థం చేసుకుని వారితో సన్నిహితంగా ఉండడం ఆయనకు అలవాటు అయింది. ఈ అనుభవం తర్వాత ఆయన ప్రజా సేవలోకి పూర్తిగా అడుగుపెట్టారు.

**స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ పాత్ర :–**

సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పనిచేశారు. గుజరాత్‌లో రైతులు ఎదుర్కొన్న కష్టాలను దగ్గరగా గమనించి, వారికి న్యాయం చేయాలని సంకల్పించారు. కేడా సత్యాగ్రహం, బార్డోలీ సత్యాగ్రహం వంటి రైతు ఉద్యమాలను విజయవంతంగా నడిపి బ్రిటిష్ ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గేలా చేశారు. రైతులు పన్నులు చెల్లించలేని పరిస్థితి ఉన్నప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం రాయితీలు ఇవ్వకపోవడంతో పటేల్ ప్రజలను ఐక్యం చేసి, బలమైన పోరాటం నిర్వహించారు. చివరికి ప్రభుత్వం వెనక్కి తగ్గి పన్ను మినహాయింపు ఇచ్చింది. ఈ విజయంతో పటేల్‌కు "సర్దార్" అనే బిరుదు లభించింది.

స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ దశలలో కీలకపాత్ర పోషించారు. సత్యాగ్రహం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా అనే ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారు. అయినప్పటికీ పటేల్ ధైర్యం

తగ్గలేదు. ప్రజల్లో జాతీయ భావనను నింపి, స్వాతంత్ర్యం కోసం చివరి వరకు కృషి చేశారు.

సంస్థానాల విలీనం – పటేల్ చాకచక్యం

**హోమ్ మంత్రి గా ప్రభావవంతమైన సేవ:–**

స్వాతంత్ర్యం తర్వాత సర్దార్ పటేల్ హోమ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రధాన లక్ష్యం ఒకటే – భారతదేశాన్ని ఒకే ఐక్య దేశం గా నిలపడం. ఇందుకోసం సంస్థానాధిపతులతో సహనం, సంయమనం ప్రదర్శిస్తూ చర్చలు జరిపారు. కొన్నిసార్లు బుజ్జగింపులు, కొన్నిసార్లు కఠిన హెచ్చరికలు ఇచ్చి 550కి పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయించారు. ఈ ప్రక్రియలో వి.పీ. మీనన్ వంటి అనుభవజ్ఞుల సలహాలను సద్వినియోగం చేసుకున్నారు.

**హైదరాబాద్ సమస్య – అత్యంత క్లిష్టమైన సవాలు:–**

ఆ సమయంలో హైదరాబాద్ నిజాం సంస్థానం ఇబ్బంది తీసుకుని వచ్చింది. రాజైన నిజాం మిర్ ఉస్మాన్ అలీ ఖాన్ స్వతంత్రంగా ఉండాలని పట్టుబట్టాడు. వీలైతే పాకిస్తాన్లో కలిసేందుకు కూడా సిద్ధపడ్డాడు.

అప్పట్లో హైదరాబాద్ అతిపెద్ద సంస్థానం. నిజాం ప్రభుత్వం, అతని సైన్యం మాత్రమే కాకుండా రజాకార్లు అనే సాయుధ ముస్లిం మిలీషియా ప్రజలపై దౌర్జన్యాలు సృష్టించడం మొదలుపెట్టారు. రజాకార్లు గ్రామాల్లో హింస, హత్యలు, దోపిడీలు చేస్తూ ప్రజల్లో భయాన్ని రగిలించారు. ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకొని తీవ్రంగా వేధించారు వందల మందిని హతమార్చారు చాలామంది మహిళలను అత్యాచారం చేశారు. అనేక వేల మంది బాలికలు మహిళలని మాయం చేశారు వారి ఆచూకీ ఇప్పటికీ కూడా తెలియదు. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు భయంతో గడిపారు. వ్యవసాయం, వ్యాపారం, చదువులు అన్నీ దెబ్బతిన్నాయి.

**ఆపరేషన్ పోలో – ధైర్యంతో తీసుకున్న నిర్ణయం:–**

ఈ పరిస్థితిని గమనించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందుకు కదిలారు. చాలా వరకు చర్చల ద్వారానే సమస్య పరిష్కరించాలని ప్రయత్నించారు. కానీ పరిస్థితి అదుపు తప్పడంతో కఠిన నిర్ణయం తీసుకున్నారు. 1948 సెప్టెంబర్లో భారత సైన్యాన్ని పంపి "ఆపరేషన్ పోలో" ప్రారంభించారు. కేవలం ఐదు రోజుల్లోనే రజాకార్ల దౌర్జన్యాన్ని అణచి, నిజాం సైన్యాన్ని లొంగదీసి హైదరాబాద్ను భారత యూనియన్లో చేర్చారు. ఈ చర్య వల్ల రాష్ట్రంలో శాంతి తిరిగి నెలకొంది. తెలంగాణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో సెప్టెంబర్ 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటిస్తూ ఉంటారు.

**పటేల్ దూరదృష్టి – భవిష్యత్‌కు బలమైన పునాది**

సర్దార్ పటేల్ నిర్ణయం కేవలం ఒక రాష్ట్ర విలీనం కాదు, దేశ భవిష్యత్తును కాపాడిన చారిత్రక క్షణం. హైదరాబాద్ స్వతంత్రంగా ఉంటే, భారత్ గుండెల్లో ఒక విదేశీ దీవిలా ఉండేది. భవిష్యత్తులో దేశ భద్రతకు అది ముప్పుగా మారేది. పటేల్ ఈ ప్రమాదాన్ని ముందే గుర్తించి సమయానికి తగిన చర్య తీసుకున్నారు.

**పటేల్ వారసత్వం:–**

సర్దార్ పటేల్ దూరదృష్టి వల్లే నేడు భారతదేశం ఒకే రాజకీయ ఐక్య దేశం గా నిలిచింది. ఆయన కృషి వల్ల రాష్ట్రాల మధ్య సరిహద్దులు సజావుగా ఏర్పడ్డాయి. దేశం ఒకే రాజ్యాంగం కింద నడవడానికి బలమైన పునాది పడింది. అందుకే ఆయనను "భారత ఐరన్ మాన్" అని గౌరవంగా పిలుస్తారు.

సర్దార్ పటేల్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, కఠిన పరిస్థితుల్లో కూడా వెనుకడుగు వేయని ధైర్యవంతుడు. ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ ఐక్యత, ప్రజల భద్రత కోసం మాత్రమే. నేటి తరానికి ఆయన జీవిత ఒక ప్రేరణ.

★

---

**జీవితం అనేది గమ్యం కాదు... గమనం మాత్రమే... ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి అవకాశముంటుంది. గమ్యం అనంతం... గమనం అనేకం ...**

విజ్ఞానం

# భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ



✍ ఉపద్రష్ట లక్ష్మణసూరి

**2023**వ సంవత్సరం ఆగస్టు 23. భారత దేశ త్రివర్ణ పతాకం సగర్వంగా ఏకంగా నింగిలోని చంద్రుని మండలం పై ఎగిరిన రోజు. ప్రతి భారతీయ మది ఆనందంతో ఉప్పొంగిన రోజు. భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఇస్రో చంద్రయాన్ 3 ద్వారా విక్రమ్ ల్యాండర్‌ను ప్రజ్ఞాన్ రోవర్‌ను మృదువైన లాండింగ్ తో చంద్రుని దక్షిణ ధృవ ప్రాంతం శివశక్తి బిందు వద్ద దిగిన మొట్టమొదటి దేశంగా ప్రపంచ అంతరిక్ష వైజ్ఞానిక ఎవనికపై సువర్ణ అక్షరాలు లిఖించింది. జులై 14, 2023లో శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి మధ్యాహ్నం రెండు గంటల ముప్పై ఐదు నిమిషాలకు ప్రయోగించిన చంద్రయాన్ 3 ఆగస్టు 5న చంద్రుడి కక్షలోకి ప్రవేశించింది. విక్రమ్ ల్యాండర్ డిభూస్టింగ్ ప్రక్రియ ద్వారా వేగాన్ని తగ్గిస్తూ చంద్రుని ఉపరితలానికి చేరువై ఆగస్టు 23న జాబిల్లి దక్షిణ ధ్రువం పై విక్రమ్ ల్యాండర్ కాలు మోపింది. వెంటనే విక్రమ్ ల్యాండర్ తీసిన జాబిల్లి ఫోటోలను చందమామ ఉపరితలంపై ఉన్న బిలాలను ఇస్రో విడుదల చేసింది. ఇంతటి అత్యంత క్లిష్టమైన అంతరిక్ష ప్రయోగాన్ని సాధించిన శాస్త్రవేత్తల బృందాన్ని అభినందిస్తూ ఈ విజయానికి చిహ్నంగా ప్రతి భారతీయ విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచడానికి మన ప్రియతమ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర దామోదర్ దాస్ మోడీ గారు ఆగస్టు 23 ను నేషనల్ స్పేస్ డే అంటే జాతీయ అంతరిక్ష దినోత్సవం గా ప్రకటించారు నాటి ఆర్యభట్ట నుండి నేటి గగనయాన్ వరకు ప్రాచీన విజ్ఞానం నుండి అనంత అవకాశాల వరకు అనే థీమ్ తో ప్రతి పాఠశాల, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలలో ఈ విజయాన్ని విజ్ఞాన పండుగగా ఉత్సాహంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

2. చంద్రయాన్ 3 ప్రయోగం విజయంతో ఇస్రో శాస్త్రవేత్తల బృందం మరెన్నో ప్రయోగాలకు రూపకల్పన చేసింది. నైసార్ ఉపగ్రహాన్ని GSLVF-16 రాకెట్ ద్వారా విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తీరు ఆద్యంతం అద్భుతం అమోఘం. నాసా శాస్త్రవేత్తలపై భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ చూపించిన అభిమానం సహకారం మరువలేనిది. ఇస్రో నాసా పరస్పర సహకారంతో మరో రెండు ప్రయోగాలు చేయడానికి మేము ముందుకు వస్తున్నాం. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ఇస్రో శాస్త్రవేత్తలకు మా దేశం కృతజ్ఞతలు తెలుపుతోంది. ఈ మాటలు అన్నది ఎవరో కాదు అంతరిక్ష ప్రయోగాలలో పేరు మోసిన ప్రపంచ అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా. అవును ఇది నిజం అంతరిక్షంలో విజయకేతనాలు ఎగరవేస్తూ నాటి1975 ఆర్యభట్ట నుండి నేటి నైసర్ ఉపగ్రహం వరకు అంతరిక్షంలో జైత్రయాత్ర చేస్తున్న భారత దేశం యొక్క భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ప్రతి భారతీయుడు మదిని ఆనందంతో నింపుతోంది. అంతరిక్ష విజయాలు ఏ ఒక్క దేశానికో పరిమితం కాకూడదు వైజ్ఞానిక విజయాల ఫలాలు ఈ భూమిపై ఉన్న అందరూ సమానంగా అనుభవించాలి. వసుధైక కుటుంబం అనే స్ఫూర్తితో సాగుతున్న ఇస్రో తో నాసా కూడా జత కట్టింది. భూమిపై జరిగే మార్పులను కచ్చితంగా పరిశీలించే నైజర్ అనే ఉపగ్రహాన్ని ఇస్రో నాసా సంయుక్తంగా తయారు చేసింది. నాసా ఇస్రో సింథటిక్ అపర్చర్ రాడార్ నైసర్ ఉపగ్రహాన్ని జియో సింక్రోనోస్ లాంచింగ్ వెహికల్ GSLVF-16 ఉపగ్రహ నౌక ద్వారా భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులోని సూర్య సమకాలిక కక్షలోకి విజయవంతంగా 2023 జులై 30న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించారు. డ్యూయల్ ఫ్రీక్వెన్సీ, ఎల్ బ్యాండ్ ఎస్ బాండ్ తో భూమిని అత్యంత దగ్గరగా

పరిశీలించే ఉపగ్రహం నైసర్. భూమి ఉపరితలంలో నేలవైకల్యం, మంచు పలకల కదలిక, వృక్ష సంపద, సముద్రపు మంచు వర్గీకరణ, ఓడల గుర్తింపు, తీర ప్రాంత పర్యవేక్షణ, తుఫాను లక్షణాలు, నేల తేమలలో మార్పులు, ఉపరితల నీటి వనరుల మ్యాపింగ్, విపత్తు సమయాల్లో హెచ్చరికలకు సంబంధించిన సమాచారాన్ని ఈ ఉపగ్రహం ఐదేళ్లపాటు అందిస్తూనే ఉంటుంది. అత్యంత కీలకమైన క్రయోజనిక్ దశలో 15 టన్నుల క్రయోజనిక్ ఇంధనం సాయంతో మూడో దశ ద్వారా నైసర్ ఉపగ్రహం సూర్య సమకాలిక కక్షలోకి ప్రవేశించింది. అక్కడి నుండి ఉపగ్రహాన్ని బెంగళూరుకు సమీపంలోని హాసన్ లో ఉన్న మాస్టర్ కంట్రోల్ సెంటర్ తన ఆధీనంలోకి తీసుకుని ఉపగ్రహ పనితీరును పర్యవేక్షించడం ప్రారంభించింది. ఇస్రో నాసా సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ ఉపగ్రహ ప్రయోగం శ్రీహరికోట నుండి జరిగిన 102 వ ప్రయోగం. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో స్వదేశీ సాంకేతికతలు వికసితభారత్ అనేస్ఫూర్తితో ఇప్పటికే ఇస్రో 100 ఉపగ్రహ ప్రయోగాల మైలురాయిని విజయవంతంగా అధిగమించింది. ఇస్రో 101వ ఉపగ్రహం ఎర్త్ అబ్జర్వేషన్ సాటిలైట్ లుమోసుకు వెళ్లే పి ఎస్ ఎల్ వి సి 61 మే 18న మూడవ స్టేజిలో వచ్చిన పీడన సాంకేతిక సమస్యల వల్ల విఫలమైన ఈ వైఫల్యంతో నిరాశ చెందక సాంకేతిక వైఫల్యాలను అధిగమించి GSLV ద్వారా 102వ ఉపగ్రహం నైసర్‌ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

3. 2023 ఫిబ్రవరి మూడో తారీకు భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఒక ముఖ్యమైన ఉపగ్రహాన్ని విజయవంతంగా GSLVF-15 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో యొక్క 100వ ఉపగ్రహం ఎన్ వి ఎస్ జీరో టు ను వ్యూహాత్మక మరియు పౌర అనువర్తనాలకు ఉపయోగపడే దిశగా జిపిఎస్ వ్యవస్థలకు సంబంధించి పౌరులకు సేవ చేసే విధంగా 100వ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. భారతదేశ ప్రాంతీయ ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ వినియోగదారులకు ఖచ్చితమైన స్థానం వేగం మరియు సమయం సేవలను అందించడానికి రూపొందించిన ఉపగ్రహం ఎన్విఎస్ జీరో టు. 1963 లో సౌండింగ్ రాకెట్ల ప్రయోగంతో ప్రారంభింపబడిన ఇస్రో గణనీయమైన పురోగతిని సాధిస్తూ ఎన్ వి ఎస్ 02 100వ ఉపగ్రహ ప్రయోగం ఎన్నో సంవత్సరాల కృషి భారతీయ శాస్త్రవేత్తలు అంకిత భావానికి పరాకాష్ఠగా నిలిచింది. 1994 నుండి ఇస్రోయొక్క గెలుపు గుర్రం గా పిఎస్ఎల్వి ఎన్నో ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. నాలుగు అంతస్తులతో 3250 కేజీల సామర్థ్యం తో పిఎస్ఎల్వి భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుగా నిలిచింది. 2008లో చంద్రయాన్ వన్ మిషన్, 2013లో మార్స్ ఆర్బిటార్ మిషన్ మంగళయాన్, 2017 వ సంవత్సరంలో ఏకంగా చరిత్రను తిరగరాస్తూ ఏ దేశం సాధించలేని ఘనతగా పిఎస్ఎల్వీ ద్వారా వివిధ దేశాలకు మన దేశానికి చెందిన 114 ఉపగ్రహాల ను ఒకేసారి ఉపయోగించడం, ఎర్త్ అబ్జర్వేషన్ సాటిలైట్స్, నావిగేషన్ సాటిలైట్స్, కమ్యూనికేషన్ సాటిలైట్స్, సైంటిఫిక్ పేలోడ్స్ లాంటి వివిధ శాస్త్ర సాంకేతిక పరిశోధనలకు పిఎస్ఎల్వీ నిర్విరామంగా ఉపయోగపడుతూనే ఉంది. ఒక్క 3 వైఫల్యాలు తప్ప పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్ అంతరిక్షంలో నిత్య దీపావళి జరుపుకుంటూనే ఉంది. రాబోయే రోజుల్లో జరుపబోయే భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకుని 2024వ సంవత్సరం డిసెంబర్ 30న ఇస్రో యొక్క 99 వ ప్రయోగం నిర్వహించడం జరిగింది. పిఎస్ఎల్వీ సి 60 ద్వారా స్పేడ్ ఎక్స్ (SPADEX) ప్రయోగం జరిగింది. స్పేస్ డాకింగ్ ఎక్స్పరిమెంట్ ద్వారా భవిష్యత్తు అంతరిక్ష కార్యకలాపాలకు కీలకమైన సాంకేతికత అయిన ఉపగ్రహ డాకింగ్ సామర్థ్యాలను ప్రదర్శించే దిశగా 99వ ప్రయోగం జరిగింది. భూమి దిగువ కక్షలో రెండు చిన్న అంతరిక్ష నౌకలు SDX01 చేజర్ మరియు SDXO2, టార్గెట్ కలుసుకునే డాకింగ్ టెక్నాలజీ అభివృద్ధి చేశారు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో ...)

# గణపతి ఉత్సవాల చిత్రమాలిక



అమరచింత



అశోక్‌నగర్-అనంతపురం



చాగలమర్రి



ధూల్‌పేట



గొల్లపల్లి-మక్తల్ (పాలమూరు)



కామారెడ్డి:- శ్రీ సరస్వతీ శిశుమందిర్ కామారెడ్డి ఉన్నత పాఠశాల బడి ఆవరణలో గణేష్ ప్రతిమ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు.



కె.డి.ఆర్.నగర్-వనపర్తి

# గణిత విజ్ఞాన మేళ చిత్రమాలిక



**ఆదర్శనగర్:-** రాష్ట్రస్థాయి పోటీలలో శ్రీ సరస్వతీ శిశు మందిర్, ఆదర్శనగర్, నిర్మల్ విద్యార్థి వి. సాహితీ బాల వర్గ లో మట్టి తో విగ్రహాల తయారీ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది.



**భైంసా:-** కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొన్న పులేనగర్ శిశు మందిర్ విద్యార్థిని రమ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది.




**కె.డి.ఆర్‌నగర్:-** శిశు మందిర్ హై స్కూల్ కె.డి.ఆర్ నగర్,వనపర్తి పాఠశాల. విద్యార్థులు కామారెడ్డిలో



**కూకట్‌పల్లి:-** కూకట్‌పల్లి పాఠశాల విద్యార్థిని, 10వ తరగతి నుండి ఐ.మోహన రూప, శ్రీ సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞానమేళాలో ప్రథమ బహుమతిని గెలుచుకుని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర విజ్ఞాన గణిత మేళాకు ఎంపికైంది.




**కార్వాన్ :-** శ్రీ సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ఆధ్వర్యములో నిర్వహింపబడిన రాష్ట్రస్థాయి విజ్ఞాన మేళ (సైన్స్ ఫెయిర్) శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల కామారెడ్డిలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల కార్వాన్ విద్యార్థులు 1. చి.నిత్య 9వ తరగతి (ఉపన్యాస పోటీ), 2. చి.భువిశ్రీ 7వ తరగతి (జనతా క్విజ్) ద్వితీయ స్థానం సాధించారు.

జరిగిన స్టేట్ లెవెల్ సైన్స్‌ఫేయిర్లో బాలవర్గ ఇన్నోవేటివ్ మోడల్స్ లో ఫస్ట్ ప్రైజ్ సాధించిన డి.జైష్ అఖిల్.

# గణిత విజ్ఞాన మేళ చిత్రమాలిక



కేపీహెచ్‌బీ కాలనీ:– శ్రీ సరస్వతీ విద్యా పీఠం వారి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో మేడ్చల్ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు.

ఈ సైన్స్ ఫెయిర్‌లో సికింద్రాబాద్ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ శ్రీనివాస్ నగర్ పాఠశాల తరపున నాల్గవ తరగతి విద్యార్థి రుషికేశ్ గణిత శాస్త్రంలో ఇన్నోవేటివ్ కాన్సెప్ట్ మోడల్‌కు మొదటి బహుమతి సాధించాడు.



**సరస్వతీనగర్ :–** సరస్వతీనగర్ ఉన్నత పాఠశాల–సైదాబాద్ కు చెందిన రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళ విజేతలు.





**పటాన్‌చెరువు:–** సృజనోత్సవ్ 2025 పోటీలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ పోటీలలో విద్యాభారతి హైస్కూల్, పటాంచెరువు ఉపాధ్యాయులు & విద్యార్థులు బహుమతులు పొందారు



**రాంపూర్:–** విభాగ్ స్థాయి విజ్ఞానమేళాలో విజయం సాధించిన విద్యారణ్య ఆవాస విద్యాలయం రాంపూర్ విద్యార్థులు

# ఖేల్‌కూద్ కార్యక్రమాల చిత్రమాలిక



**మంచిర్యాల :-** ప్రాంత స్థాయి అథ్లెటిక్సు పోటీలలో శిశువర్గ విభాగంలో మంచిర్యాల విభాగ్ ప్రథమ స్థానంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకుంది, ప్రాంత శైక్షణిక ప్రముఖ్ విజేతలకు ట్రోఫీనీ అందజేశారు.




**రాంపూర్:-** క్షేత్రస్థాయి ఖేల్ ఖూద్ పోటీలలో భాగంగా బెంగుళూరులో జరిగిన ఖో-ఖో పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన రాంపూర్ విద్యార్థులు.



**అచ్చంపేట:-** ఆదిలాబాద్ లో జరిగిన శ్రీ సరస్వతీ విద్యాపీఠం జరిపిన ఖేల్ కూద్ లో పాల్గొన్న అచ్చంపేట పాఠశాల విద్యార్థి మూడు విభాగాలలో గెలిచి తెలంగాణ రాష్ట్ర చాంపియన్ గా నిలిచిన నిమ్మల గంగాధర్



**కేశవపురం-జమ్మికుంట:-** ఆదిలాబాద్ శిశు మందిర్ పాఠశాలలో ప్రాంత స్థాయి ఖేల్‌కూద్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ ఖేల్‌కూద్ పోటీలలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం కేశవపురం జమ్మికుంట పాఠశాల నుండి 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు వివిధ ఈవెంట్స్ లలో ప్రథమ 20 , ద్వితీయ 09 మరియు తృతీయ 10 బహుమతులు సాధించారు.

గెలుపొందిన విద్యార్థులను పాఠశాల సమితి అధ్యక్షులు శ్రీ చెట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దొరస్వామి నాయక్ గారు మరియు పాఠశాల ప్రధానాచార్యులు శ్రీ పోలసాని సుధాకర్ రావు గారు అలాగే ఆచార్య బృందం విద్యార్థులను అభినందించారు.



**మంచిర్యాల:-** ప్రాంత స్థాయి అథ్లెటిక్స్ బాల వర్గ పోటీలలో మంచిర్యాల విభాగ్ తృతీయ స్థానంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ గెలుచుకుంది. రావుల సూర్యనారాయణ గారు విజేతలకు ట్రోఫీనీ అందజేశారు.

# శిశుమందిర్ బాలలు గీసిన చిత్రాలు



యం.సంగీత్ –3వ తరగతి–గట్టుప్పల్



ఎ.జశ్వంత్ –8వ తరగతి–శ్రీశారదాధామం




ఎ.గాయత్రి –8వ తరగతి–కె.డి.ఆర్.నగర్–వనపర్తి



యం.సుప్రియ –7వ తరగతి–మాదన్నపేట



యం.సాన్విక–7వ తరగతి – నారాయణఖేడ్



ఎ.హర్షవర్ధన్ –5వ తరగతి–సదాశివపేట

జి.కె.

# లోక జ్ఞానము - 203



అయాచితుల లక్ష్మణరావు

## సెప్టెంబర్ 2025, "స్ఫూర్తి" ఆధారంగా

1. రాష్ట్ర ధర్మప్రకాశన్ సంస్థను ప్రారంభించినది ఎవరు?
2. ధర్మపురి నరసింహశతక రచయిత ఎవరు?
3. రామాయణంలో పేర్కొన్న పుష్పకవిమాన నిర్మాత ?

### ధర్మం - సంస్కృతి

4. మేఘునాథుని మరోపేరేమి?
5. దేవేంద్రుని వాహనమేది?
6. భగవద్గీత ఎవరి ఉవాచతో ప్రారంభం అవుతంది?

### గణిత - వైజ్ఞానిక అంశములు

7. మానవ శరీరంలో అతిపెద్ద గ్రంథి ఏది?
8. సున్నను కనుగొన్నది ఎవరు?
9. సరిసంఖ్య అయిన ప్రధాన సంఖ్య ఏది?

### సామాజిక శాస్త్రాలు

10. భారత రాజ్యాంగం గుర్తించిన భాషలు ఎన్ని?
11. భారత దేశ మధ్యగా వెళ్లే అక్షాంశం ఏది?
12. భారత మొదటి రాష్ట్రపతి ఎవరు?

### సమకాలీన అంశాలు

13. భారత ఉపరాష్ట్రపతిగా ఎవరు ఎన్నికైనారు?
14. సామాజిక మాధ్యమ నిషేధంతో ఏ దేశంలో కల్లోలం జరుగుతోంది?
15. ఆంధ్ర ప్రదేశ్‌లో సూపర్‌సిక్స్ పేరుతో జయభేరి సభ ఎక్కడ జరిగింది?

## లోక జ్ఞానము -202 సమాధానములు

1. త్రైలోక్యనాథ చక్రవర్తి
2. శిశుపాలుడు
3. డా॥ హెడ్గేవార్
4. భీష్ముడు
5. శనివారం
6. వేదవ్యాసుడు
7. విటమిన్-ఎ
8. సోడియం బై కార్బోనేట్
9. సుమారు 301459
10. పాకిస్తాన్
11. కాలము
12. అర్థశాస్త్రం
13. అమెరికా
14. జస్టిస్ యశ్వంత్ వర్మ
15. తెలంగాణ

## 134 జతపరచుము సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 | త | రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపన |
| 2 | ప. | జాతీయ కాంగ్రెస్ స్థాపన |
| 3 | క. | మొదటి స్వాతంత్ర్య సమరం |
| 4 | చ. | ప్లాసీ యుద్ధం |
| 5 | ట. | మొగల్ సామ్రాజ్యస్థాపన |

## 135- జతపరచుము

| | | |
|---|---|---|
| 1. భారతదేశం | ( ) | క. నైపిడో |
| 2. బంగ్లాదేశ్ | ( ) | చ. ఇస్లామాబాద్ |
| 3. పాకిస్తాన్ | ( ) | ట. కొలంబో |
| 4. శ్రీలంక | ( ) | త. ఢిల్లీ |
| 5. మయన్మార్ | ( ) | ప. ఢాకా |

**విద్యార్థులు గానీ,**

**ఆచార్యులు గానీ మీ సమాధానాలను వ్రాసి స్ఫూర్తి విభాగానికి తపాల / కొరియర్ ద్వారా పంపగలరు.**

**(లేదా)**

sphoortissvp@gmail.com కి మెయిల్ ద్వారా పంపగలరు.


పోషకుల పేజి

# వయసు పెరుగుతోంది....
# మనసు ఎదుగుతోందా?



✍ - లింగం సుధాకర్ రెడ్డి

"పిల్లలు తింటున్నారా... అనే కాదు, ఎలా ఉంటున్నారో పరిశీలించండి! స్కూల్‌కు వెళుతున్నారా.. అనేకాదు... వారేం నేర్చుకుంటున్నారో ఆరా తీయండి! మార్కులు బాగా వస్తున్నాయా... అనే కాదు... ఏ ఆలోచనలు వారిని చుట్టుముడుతున్నాయో అర్థం చేసుకోండి... పుట్టినప్పటి నుంచి టీనేజీ వరకు వారిది ఎదిగే వయసే కాదు... మనసు కూడా... అది ఏ దశలోనైనా గాడి తప్పవచ్చు..." అంటూ ఈ మధ్యనే ఏ వయస్సు పిల్లల వ్యవహారం ఎలా ఉండాలి? దానిని తల్లిదండ్రులు గమనించడమే కాదు సరిచేయడమెలాగో నిపుణులు చెప్పిన విషయాలను ఈ మధ్య ఈనాడు దిన పత్రిక "వయసు పెరుగుతోంది.... మనసు ఎదుగుతోందా?" .... అనే శీర్షికన ప్రచురించిన విషయాలు తల్లిదండ్రులందరూ గమనించాల్సిన విషయాలే కాదు, ఆచరించాల్సిన విషయాలు కూడా. కేవలం ఫీజులు కట్టి తమ పిల్లలను బడికి పంపించినంత మాత్రాన తల్లిదండ్రుల బాధ్యత తీరి పోదంటూ గుర్తు చేశారు.



కథలు వింటూ.. కలలు కంటూ పెరగాల్సిన బాల్యం గాడితప్పుతోంది. పుస్తకాలతో చెలిమి చేయాల్సిన పిల్లలు వ్యసనాలకు బానిసలవుతున్నారు. ప్రతిభాపాటవాలతో పేరు తెచ్చుకోవాల్సినవారు నేరాల చిట్టా తెరుస్తూ బంగారు భవితను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు..

తప్పటడుగు వేసినప్పుడు సరిచేసే పెద్దోళ్లు లేనప్పుడు.. చేసింది తప్పుడుపనంటూ సన్మార్గంలో నడిపించే వ్యవస్థ లేనప్పుడు.. ఒకరి నేరమయ జీవితానికి బీజం పడొచ్చు.. భవిష్యత్తులో సంఘవిద్రోహ శక్తిగా మారేందుకు ఆస్కారముండొచ్చు..

బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాగానే బుడిబుడి అడుగులతో హత్తుకోవడం ప్రతి తండ్రికీ మధురానుభూతే. ఇది రెండేళ్ల వయసున్న పిల్లల్లో ఉండే సాధారణ లక్షణం. అలా కాకుండా దీనికి భిన్నంగా ఆ వయసు చిన్నారులు ప్రవర్తిస్తుంటే.... అనుమానించాల్సిందే. అమ్మ, నాన్న ఇంటి నుంచి బయటికి వెడుతున్నా పట్టించుకోకుండా ఉండటం... తిరిగి ఇంటికి వచ్చినా సంతోష పడకపోవడం... అనేది ఆ పిల్లల్లో మానసికంగా ఏదో తేడా జరుగుతోందనే దానికి సంకేతాలు!

అదే పెద్దయ్యాక... పాఠశాలలో పిల్లలందరూ ఆడుకుంటున్నా వారితో కలవకుండా ఒంటరిగా ఉండటం... చదువులో ఉన్నట్టుండి వెనుకబడటం. ఒకసారి ఎక్కువగా తినడం... కొన్ని రోజులు సరిగా తినకపోవడం. ఇతరులను పోల్చుకుంటూ కుంగిపోవడం. ఇవి కూడా మానసిక సమస్యలేనని నిపుణులంటున్నారు.

**తొలి దశలో గుర్తించడమే:-**

తల్లిదండ్రులు వారి సమస్యలను పిల్లల ముందు ప్రస్తావించకూడదు, పాఠశాల హాజరు తగ్గుతోందంటే అది తీవ్రమైన అంశంగా గుర్తించాలి, చిన్న వయసులో ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారు కాబట్టి విద్యార్థుల తీరుపై ఉపాధ్యాయులూ నిఘా పెట్టాలి.

సమస్యను తొలిదశలో గుర్తిస్తే వెంటనే మానసిక వైద్య నిపుణుడిని లేదా కౌన్సిలరును కలవాలంటూ ఎయిమ్స్‌లో మానసిక వైద్య నిపుణులు డా॥ విజయ చంద్రారెడ్డి సూచించారు.

2 నుంచి 18 ఏళ్ల వరకూ వివిధ దశల్లో కనిపించే మానసిక ప్రవృత్తులను సకాలంలో గుర్తించి అడ్డుకట్ట వేయకపోతే దీర్ఘకాలంలో ఇవి వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 10–19 ఏళ్ల పిల్లలు ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక రుగ్మతలున్నాయి. ఒత్తిడి, ఆందోళన, ప్రవర్తనా పరమైన సమస్యలు దీనికి ప్రధాన కారణాలు.

**0–3 ఏళ్ళ వయసు వరకు గమనించాల్సినవి..**

6 నెలల వయసొచ్చినా నవ్వలేకపోతే, 12 నెలలకు అమ్మ, అత్తలాంటి పదాలు పలకలేకపోతే, 18 నెలలకు పూర్తి పదాలు పలకడం రాకపోతే, 2 ఏళ్ళకు మాటలు రాకపోవడం, కళ్లల్లో కళ్ళు పెట్టి చూడలేకపోవడం, ఆడుకునేందుకు అనాసక్తి, కోపం, గుక్కపట్టి ఏడ్వడం, తల్లిదండ్రులతో అనుబంధాన్ని చూపించకపోవడం, వచ్చిన మాటలు, నడక వెనక్కి పోవడం.

**3–5 ఏళ్ళు ...**

భాష సక్రమంగా మాట్లాడలేకపోవడం, కాసేపైనా ఒకే చోట కుదురుగా కూర్చోలేకపోవడం (హైపర్ యాక్టివిటీ) పాఠశాలలో పక్కన ఉండే పిల్లల్ని డిస్టర్బ్ చేస్తూ ఉండటం, ఇతర పిల్లల్ని కొట్టడం... వారితో కలిసి ఆడుకోకుండా ఒంటరిగా ఉండటం, ఉపాధ్యాయులు చెప్పిన ఆసక్తికర అంశాలను ఇంటి దగ్గర ప్రస్తావించకపోవడం, బడికిగానీ, ట్యూషన్‌కుగానీ పంపించేటప్పుడు అమ్మను పట్టుకుని ఏడవడమనేది ఈ వయసులో తగ్గిపోవాలి. కానీ ఇంకా ఎక్కువవుతూ ఉంటే మాత్రం అనుమానించాల్సిందే.

**6–12 ఏళ్ళు ...**

ఈ వయసు పిల్లలు బాధను కోపంగా వ్యక్తపరుస్తారు. వారిలో కోపం ఎక్కువగా ఉంటే అది ఒత్తిడికి ప్రతిరూపమని గుర్తించాలి.

అప్పటి వరకు తరగతి గదిలో మంచి మార్కులు సాధిస్తున్న పిల్లవాడు... ఉన్నట్టుండి వెనకబడటం. స్నేహితులకు దూరం. తలనొప్పి, కడుపునొప్పి, కాళ్లునొప్పి, తదితర కారణాలు చూపిస్తూ పాఠశాలకు వెళ్లకపోవడం. చేతిలో ఏముంటే దాన్ని విసిరికొట్టడం రాత్రిళ్లు మేలుకోవడం, పగలు నిద్రపోవడం. ఒకసారి ఎక్కువగా తినడం, కొన్ని రోజులు సరిగా తినకుండా ఉండటం

**13–18 ఏళ్ళు ...**

ఈ వయసు పిల్లలు బాధ, కోపం, సంతోషం, అసహ్యం ఇలా అన్ని రకాల ఎమోషన్స్‌ను ప్రదర్శించగలరు. మానసికంగా అస్థిరత్వం ఉన్న పిల్లలు తమ బాధను తోటి వారి దగ్గర వ్యక్తపరుస్తూ ఉంటారు. తనని తాను బాధించుకోవడం(సెల్ఫ్ హార్మ్) అనేది ఈ వయసులో కనిపిస్తుంది.

ఒత్తిడికి ఎక్కువగా గురవుతుంటారు, పాఠశాల హాజరు తక్కువగా ఉంటుంది, బాగా మార్కులు వచ్చే పిల్లలకు ఉన్నట్టుండి తక్కువ రావడం, సమస్య లేకపోయినా ఎక్కువ ఉన్నట్లు ఆందోళనకు గురికావడం, “లావుగా ఉన్నా... సన్నగా ఉన్నా” అనే భావనతో కుంగిపోవడము వీటిని గమనించి సరిచేయాలి, లేదంటే వైద్య నిపుణులను సంప్రదించాలంటూ మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



**బెంగుళూర్:–** క్షేత్ర శిశువాటిక పరిషత్ బైఠక్ – బెంగళూర్ ★



**సరస్వతీనగర్ :–** స్పోర్ట్స్‌డే సందర్భంగా పిరమిడ్స్ వేస్తున్న చిన్నారులు ★

# పౌరుల కర్తవ్యం



- పతకమూరి శ్రీనివాసరావు

మన రాజ్యాంగంలో పౌర హక్కులతో పాటు పౌర విధుల గురించి కూడా చెప్పబడింది. కాని దురదృష్టవశాత్తు స్వతంత్ర భారతంలో పౌర హక్కుల గురించి చర్చించినంతగా పౌర విధుల గురించి చర్చించలేదు. రాజ్యాంగంలో ప్రాథమిక విధులు ఈ విధంగా ఉన్నాయి.

1. భారత రాజ్యాంగాన్ని గౌరవించవలెను. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించవలెను.

2. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రోత్సహించబడ్డ ఆదర్శాలను గౌరవించాలి.

3. భారత దేశపు సార్వభౌమత్యాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని గౌరవించి, పెంపొందింప వలెను.

4. అవసరం లేదా అవకాశం కలిగితే భారత దేశానికి సేవ చేయుటకు ఎల్లవేళలో సిద్ధంగా ఉండవలెను.

5. భారత దేశంలో కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదాలు లేకుండా ప్రజలందరిని గౌరవించవలెను. సోదర భావాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించ వలెను. స్త్రీల యొక్క గౌరవ మర్యాదలను భంగపరిచే అమర్యా దకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి.

6. మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతిని, మిశ్రమ అద్భుత వారసత్వాన్ని కాపాడుకొనవలెను.

7. ప్రకృతి, పరిసరాలైన అడవులను, సరస్సులను, నదులను, వన్య ప్రాణులను ఇతర జీవులను సంరక్షించు కొనవలెను.

8. శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి జ్ఞానాభివృద్ధి కొరకు ఎల్లవేళలా పాటుపడవలెను.

9. ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలెను. హింసను విడనాడవలెను.

10. భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తి గతంగాను, సామాజికంగాను లేదా మిశ్రమంగాను పాటుపడుతూ దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ దానిని సాధించుటకు కృషి చేయవలెను.

11. 6-14 సంవత్సరాల పిల్లలకి నిర్బంధ విద్యను అందించాలి.

పైన రాజ్యాంగంలో విధుల గురించి తెలుసుకున్నాము. కాని మన నిత్య జీవితంలో తమ బాధ్యతలను మరిచి ప్రవర్తిస్తుంటారు. అటువంటి కొన్ని విషయాలు చర్చిద్దాం.

1. ట్రాఫిక్ సిగ్నల్స్ ను గౌరవించాలి. పోలీసులు ఉన్నా లేకున్నా రెడ్ సిగ్నల్‌కు ఆగిపోవటం. గ్రీన్ సిగ్నల్ లో మాత్రమే చౌరస్తాలను దాటాలి.

2. 'టూ వీలర్'లో ఇద్దరు మాత్రమే ప్రయాణం చేయాలి. చాలా సార్లు ముగ్గురు, నలుగురు,ఐదుగురు కూడా ప్రయాణం చేస్తుంటారు. ఇది ప్రమాదకరం మరియు చట్ట విరుద్ధం.

3. టూ వీలర్ మీద వెళ్ళే సమయంలో 'హెల్మెట్' ధరించాలి. పోలీసులకు, ఫైన్‌లకు భయపడి కాకుండా తన బాధ్యతగా భావించి పాటించాలి.

4. కార్‌లో ప్రయాణం చేసే సమయంలో ముందటి సీటులో కూర్చున్న వారు తప్పని సరిగా సీట్ బెల్ట్ ధరించాలి.

5. ప్రయాణం చేసే సమయంలో వేగ పరిమితి (స్పీడ్ లిమిట్) గమనించి వాహనాలు నడపాలి.

పై నియమాలు అన్నా పాటిస్తే, మన భద్రత ఇతరుల భద్రత కూడా పెరుగుతుంది.

6. రైళ్ళలో, బస్సులలో ప్రయాణం చేసే సమయంలో బిస్కెట్ పాకెట్ కవర్లు, చాయ్ కవర్లు తిన్న చోట, తాగిన చోట వదిలేయకుండా తప్పని సరిగా చెత్తబుట్టలో వేయాలి.

7. స్వచ్ఛత ఉన్న దగ్గర భగవంతుడు ఉంటాడు కాబట్టి మన గృహం, పరిసరాలు, వీధులు, గ్రామం, నగరం, మొత్తం

దేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. ఎక్కడంటే, అక్కడ చెత్త వేయకూడదు. తప్పని సరిగా చెత్తబుట్టలోనే వేయాలి. దేశాన్ని పరిశుభ్రంగా ఉంచకోవటం మన బాధ్యత.

8. వ్యక్తిగతమైన, పబ్లిక్ టాయ్‌లెట్స్ అయినా ఉపయోగించిన తరువాత తగినంత నీరు ఉపయోగించి శుభ్రపరచాలి. అనేక సందర్భాలలో ముఖ్యంగా కొందరు టాయ్‌లెట్ ఉపయోగించాక సరిగా శుభ్రం చేయని కారణంగా తరువాత వారికి ఇబ్బంది కలుగుతుంది.

- మనం విధులు పాటిస్తే ఇతరుల హక్కులు రక్షించ బడతాయి.
- మన హక్కులు ఇతరులకు ఆటంకం కలగకుండా చూసు కోవాలి.

9. విద్యుత్తు పొదుపుగా వాడాలి. అవసరం అయిన మేరకే వాడాలి. చాలాసార్లు పాఠశాలల్లో, కార్యాలయములలో లైట్లు, ఫాన్లు తిరుగుతూ ఉంటాయి. గదుల్లో ఎవరూ ఉండరు-గది నుండి బయటకు వెళ్లే చివరి వ్యక్తి తప్పని సరిగా లైట్లు, ఫాన్లు, గీజర్‌లు ఆపేసి వెళ్ళాలి. చాలా సందర్భాలలో ఇప్పుడే వస్తాం కదా అని ఆపకుండా వెళతాం, అక్కడ వేరే పనిబడి, లేదా మాట్లాడుతూ ఉంటాం. లైట్లు, ఫాన్‌లు తిరుగుతూనే ఉంటాయి. కరెంట్ పోయినపుడు కూడా మనం బయటకు వెళుతుంటే లైట్లు, ఫాన్‌లు ఆపేసి వెళ్ళాలి లేకపోతే కరెంట్ వచ్చిన తరువాత మనం తిరిగి వచ్చే వరకు లైట్లు, ఫాన్‌లు తిరుగుతూనే ఉంటాయి.

10. నీటిని కూడా పొదుపుగా వాడాలి. కుళాయి పూర్తిగా విప్పకుండా అవసరం అయినంత వరకే విప్పాలి. బ్రష్ చేసే సమయంలో, షేవింగ్ చేసే సమయంలో అవసరం అయినపుడు మాత్రమే ఆన్ చేయాలి. మిగిలిన సమయంలో ఆఫ్ చేసి ఉంచాలి. త్రాగటానికి, స్నానానికి అవసరం మేరకే మనం నీటిని ఉపయో గించాలి. విద్యుత్తు, నీరు, ఆహారం ఇవన్నీ జాతీయ ఆస్తులు. ఒకసారి గంగా నది తీరంలో కాంగ్రెస్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయి, భోజనం చేసిన తరువాత మహాత్మా గాంధీ గారు చేయికడుగుతున్న సమయంలో, నెహ్రూ గారు మగ్‌లో ఉన్న నీరంతా పోసేశారు. గాంధీ గారు ఎందుకు నీరు వృధా చేశారు అని అడిగారు. అపుడు నెహ్రూగారు ఏమి పరవాలేదు. ప్రక్కనే గంగానది ప్రవహిస్తుంది అన్నారు. అప్పుడు గాంధీ గారు 'గంగానది' నీ కోసం, నాకోసం ప్రవహించటం లేదు సమస్త జీవరాశుల కోసం ప్రవహిస్తుంది. దాన్ని పొదుపుగా వాడటం మన కర్తవ్యం అని గుర్తు చేశారు.

**ఆహారం :-** ఈ రోజుల్లో చాలా మంది ఆహారాన్ని కూడా బాగా వృధాచేస్తున్నారు. చాలా మంది ఆకలితో అలమటిస్తున్నారు చాలా మందికి ఆహారం ఎక్కువై పాడేస్తున్నారు. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' ఆహారం జాతీయ ఆస్తి, దాని అవసరం అయిన మేరకు తీసుకోవాలి.

ముఖ్యంగా వివాహాలు, ఉత్సవాలు, కార్యక్రమాల సమయంలో కంచం నిండా పెట్టుకుంటారు, కొద్దిగా తిని మిగిలినదంతా పడేస్తుంటారు. చాలా బాధ కలుగుతుంది.

ఇంట్లో కాని, కార్యక్రమాలలో కాని అవసరం అయినంత వరకే వండాలి. వండిన దానిని పూర్తిగా తినాలి. ఫంక్షన్‌లలో ప్రతిష్ఠ కోసం అధిక సంఖ్యలో పదార్థాలు పెడుతున్నారు. ఎంత ఎక్కువ సంఖ్యలో పదార్థాలు పెడితే అంతగా వృధా అవుతుంది. ఈ అలవాటును కూడా మార్చుకోవాలి. కూరగాయలు, పండ్లు అవసరం మేరకు కొనాలి. కొన్నవి పాడుకాక ముందే పూర్తిగా వినియోగించాలి.

**వృక్షారోపణం :-** చెట్లు నాటడం,చెట్లు పెంచటం మన బాధ్యత. చెట్లు అనవసరంగా నరక కూడదు. తప్పని సరిగా నరక వలసి వస్తే దానకి రెట్టింపు మొక్కలు నాటి మాత్రమే చెట్లను నరకాలి. వృక్ష సంపదను పెంచటం మన బాధ్యత.

**పక్షులు, జంతువులు :-** పక్షులు, జంతువులకు కూడా స్వేచ్ఛగా జీవించే హక్కు ఉన్నది. వాటిని హింసించటం , బాధించటం చేయకూడదు. పెంపుడు జంతువులను జాగ్రత్తగా చూసుకోవాలి. పక్షులకు ఆహారం, నీరు అందించాలి. వారికి ఎటువంటి హాని తల పెట్టకూడదు.

**జాతీయ గీతాన్ని గౌరవించాలి :-** జాతీయ గీతం, జాతీయ గానం ఎక్కడ వినిపించినా గౌరవంగా లేచి నిలబడాలి

(తరువాయి భాగం 28వ పుటలో...)

# శివాజీ మెచ్చిన యువకుని సత్యనిష్ఠ



- రావుల సూర్యనారాయణ

**శి**వాజీ మహారాజు ఒక రోజు తన శయనాగారంలో గాఢ నిద్రలో యున్నాడు. ఆ సమయంలో ఒక యువకుడు శివాజీ సమీపంలోకి వెళ్ళి కత్తితీసి హత్యచేయటానికి పూనుకుంటాడు. ఇది గమనించిన శివాజీ సేనాపతి తానాజీ పరుగున వెళ్ళి ఆ యువకుడిని ప్రక్కకు త్రోసి క్రింద పడవేశాడు. ఈ శబ్దం విన్న శివాజీ నిద్రలేచి చూశాడు. చేతిలో కత్తియున్న ఒక యువకుడిని పట్టుకొని యున్నాడు తానాజీ. యువకుడు నిర్భయంగా నిలబడి యున్నాడు. “నీవు ఎవరు? ఎందుకొరకు వచ్చావు?” అని శివాజీ అడిగాడు.

నా పేరు మాలోజీ నేను మిమ్ములను హత్య చేయడానికి ఇక్కడకు వచ్చాను అని నిర్భయంగా చెప్పాడు.

నీవు ఈ పని చేయడానికి వచ్చినందుకు నీవు ఏ శిక్ష అనుభవించవలసి వస్తుందో తెలుసా? అని శివాజీ అడిగాడు.

“నాకు తెలుసు, మీరు మరణ శిక్ష విధిస్తారని” అని యువకుని సమాధానం.

“ఇంత తెలిసి నన్ను ఎందుకు చంపాలని వచ్చావు? నీ ప్రాణాల మీద నీకు మోహం లేదా?” అని అడిగాడు శివాజీ.

ఆ యువకుడు తన వృత్తాంతం ఇలా వివరించాడు. మా నాన్నగారు మీ సేనలో పనిచేసేవాడు. వారు యుద్ధంలో చనిపోయారు. ఆనాటి నుండి మా కుటుంబానికి ఏ సహాయం లభించలేదు. అప్పటి నుండి నేను మా అమ్మ చాలా ఇబ్బందుల్లో యున్నాము. జీవనం గడవటం కూడ చాలా కష్టంగా మారింది. అమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో వంట చేసుకోవటానికి ధాన్యపు గింజలు కూడ లేవు. ఈ కారణంగా అనేక సార్లు మేము ఉపవాసం ఉండవలసి వచ్చింది. ఇది చెబుతుంటె యువకుని కళ్ళలో నుండి జల జల నీరు కారుతూ కన్పించింది. ఆ విధంగా అతని వృత్తాంతమును చెబుతూ నేను ఒక రోజు భోజనము సంపాదించుటకు ఇంటి నుండి బయలుదేరాను. ఆ సమయంలో మీ శత్రువైన సుభాగ్‌రామ్ ఒక విషయం తెల్పాడు. శివాజీ మూర్ఖుడు. అతని కొరకు మీ నాన్న ప్రాణత్యాగం చేశాడు కాని మీ కుటుంబం గురించి ఇంత వరకు ఏమి ఆలోచించలేదు. కాబట్టి నీవు శివాజీ మహారాజుపై ప్రతీకారం తీర్చుకోవాలి. నీవు అతనిని చంపితే మీ కుటుంబం 50 సం॥లు జీవించడానికి సరిపోవు ధనమిస్తానని తెల్పాడు. ఈ మాటలు నాకు ఉచితమని తోచి మిమ్ముల హత్య చేయటానికి రావటం జరిగింది.

ఇది విన్న తానాజీ ఒరే దుష్టుడా! నీవు తలంచిన ఈ చెడు కార్యము ద్వారా హిందూ దేశ జ్యోతి ఆరిపోయేది. అందువల్ల నీవు చావడానికి సిద్ధంగా ఉండు అని హెచ్చరించాడు.

నాకు మృత్యువంటే భయంలేదు, నేను మరణ శిక్షకు సిద్ధంగా యున్నాను. కాని నాదొక కోరిక. మృత్యుశయ్యపై యున్న మా అమ్మ పాదాలను స్మరించుటకు నాకు అవకాశం ఇస్తే నేను రేపు ఉదయం మీ వద్దకు తిరిగి వస్తానని యువకుడు బదులిచ్చాడు.

నీవు రేపు ఇక్కడికి చేరకుండ ఎచటికైన పారిపోయి తిరిగి రాకపోతే ... అని శివాజీ అనుమానం వ్యక్తం చేశాడు. నేను క్షత్రియ పుత్రుణ్ణి ఒకసారి మాట ఇచ్చానంటె ప్రాణం పోయినా మాట తప్పను అని దృఢంగా పలికాడు. మాలోజీ ఇంటికి వెళ్ళటానికి అనుమతించాడు శివాజీ.

దేశం కోసం ప్రాణాలర్పించిన ఆ కుటుంబ బాధలు విన్న శివాజీ ఆ రాత్రి నిద్రపోలేదు. ఇలాంటి కుటుంబాలను ఏ విధంగా ఆదుకోవాలనే ఆలోచనతో ఆ రాత్రంతా గడిపాడు.

తెల్లవారి ఉదయం మాలోజీ తాను ఇచ్చిన మాట

ప్రకారం దర్బారు చేరుకున్నాడు.

శివాజీ మనస్సు మారింది. ఇంతటి విశేష లక్షణాలున్న వ్యక్తికి మరణశిక్ష విధించడం సబబు కాదు అని భావించి వారి అమ్మగారి క్షేమ సమాచారాలు తెలుసుకొని మాలోజీని హృదయానికి హత్తుకున్నాడు. నీ లాంటి ఉజ్వల రత్నమే దేశ గౌరవాన్ని పెంచగలుగుతుంది. మాలోజీ నేను నీకు మరణశిక్ష విధించుట లేదు. నిన్ను సేనాపతి పదవిలో నియమిస్తున్నానని ప్రకటించారు. నీ సత్యనిష్ఠకు, మాతృభక్తికి మెచ్చి ఈ బాధ్యతను ఇస్తున్నాను. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించే శక్తి సామర్థ్యాలు నీకున్నాయనే విశ్వాసం నాకుంది అని మీ తల్లి ఆశీర్వాదం తీసికొని బాధ్యతను చేపట్టుమని తెల్పాడు శివాజీ. ★

---

(26వ పుట తరువాయి భాగం ...**పౌరుల కర్తవ్యం**)

-జాతీయ జెండాను గౌరవించాలి. ఎక్కడైనా అవమానం జరిగినా, గౌరవానికి భంగం కలిగినా అడ్డుకోవాలి,రక్షించాలి.

**మహా పురుషులను గౌరవించాలి :-** మన పాఠశాలకు, ఇంటికి దగ్గరలో ఉన్న జాతీయ నాయకులు, వీరుల విగ్రహాలను దత్తత తీసుకోవాలి. వాటిని అప్పుడప్పుడు వెళ్ళి శుభ్రం చేయాలి. పూల దండలు వేయాలి. జయంతులు, వర్ధంతుల సందర్భంగా స్మరించుకోవాలి. చాలాసార్లు విగ్రహాలు, దుమ్ము, ధూళి కొట్టుకుని ఉంటాయి. ఆ విధంగా కాకుండా చూసుకోవటం మన బాధ్యత.

**భౌతిక వనరుల వినియోగం:-** భౌతిక వనరులను మితంగా, అవసరం అయినంత వరకు మాత్రమే వాడుకోవాలి. వినియోగవాదం, భోగలాలసత పెరుగుతున్నాయి.మన సంస్కృతిలో మిత వ్యయం, నిరాడంబరత, పొదుపు, సాధారణ జీవితం మన సాంస్కృతిక, ధార్మిక విలువలు. వీటిని మర్చిపోకుండా మన జీవితంలో ఆచరించాలి. భోగవాదం కారణంగా పర్యావరణం మీద ఒత్తిడి పెరుగుతుంది. ఉదాహరణకు దుస్తుల వినియోగం, వాహనాల వినియోగం, చెప్పుల వినియోగం విపరీతంగా పెరిగాయి, ప్రకటనలు, అప్పులు ఇవ్వడం ఇవన్నీ భౌతిక వాదాన్ని పెంచుతున్నాయి. మనది ఆధ్యాత్మిక దేశం ఈ జీవన మూల్యాలు, విలువలు కాపాడటం మన కర్తవ్యం.

**ఇతర పౌరవిధులు:-** సకాలంలో ఇంటిపన్ను, ఆస్తిపన్ను కట్టాలి. ఇన్‌కమ్ టాక్స్ ఎగ్గొట్టడానికి ప్రయత్నం చేస్తుంటారు. ఆదాయానికి తగ్గట్లుగా, నియమాలను అనుసరించి టాక్స్ కట్టాలి. ఉద్యోగం, వ్యాపారం నిజాయితిగా, ప్రామాణికంగా చేయాలి. ఉద్యోగస్తులు లంచం తీసుకోకూడదు. పౌరులు లంచం ఇవ్వకూడదు, అవినీతి, లంచగొండితనం లేని దేశాన్ని నిర్మించటం మన బాధ్యత.

బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదు. దేశంలో ఉన్న అందరూ బాలబాలికలను విద్యావంతులుగా చేయడం మన పరమ కర్తవ్యం. మన దృష్టిలో బడికి వెళ్ళని వారు ఉంటే వారిని చదివించే బాధ్యత స్వయంగా మనం తీసుకోవాలి. సాధ్యం అయిన చోట వయోజనులైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే ప్రయత్నం చేయటం మన బాధ్యత. పైన చెప్పిన పౌరవిధులన్నీ ఉపన్యాసాలు ఇవ్వటం కంటే మన నుండి ఆచరణ మొదలు పెట్టాలి. నేను ఆచరిస్తే నన్ను చూసి 10 మంది ఆచరిస్తారు.

**స్వదేశీ:-** స్వదేశీ వస్తువులు వాడటం, స్వభాషను ఉపయోగించటం ఆత్మ నిర్భర భారత్‌ను నిర్మించటం కూడా మన కర్తవ్యం. గత కొద్దినెలలుగా మీరు 'పంచ పరివర్తన్' గురించిన వ్యాసాలు చదివి ఉంటారు. ఇందులో కొన్ని పునరావృతం అయినట్లు అనిపించవచ్చు. ఆయా విషయాన్ని, సందర్భాన్ని బట్టి విషయాలు రాయటం జరిగింది. ఈ ఐదు విషయాలు పరస్పర పూరకాలు. ఆదర్శ హిందూ కుటుంబంలో ఇవన్నీ ఆచరించబడతాయి. అలాగే తమ పౌర విధులు అన్నీ సక్రమంగా నిర్వహిస్తే పైన చెప్పిన నాలుగు అంశాలు అంటే కుటుంబ ప్రబోధన్, పర్యావరణం,సమరసత, స్వదేశీ ఇవన్నీ కూడా ఆచరించబడతాయి. ★

**పదునైన ఆయుధం కంటే క్షణకాలంలో వచ్చే కోపమే, అత్యంత ప్రమాదకరము**

**-రామకృష్ణ పరమహంస**

పుస్తక పరిచయం

# సదాచారం... నైతిక విద్యాహారం ...




శ్రీ సరస్వతీ విద్యాపీఠం
ప్రచురణ

**పుస్తక పరిచయం :** అద్దేపల్లి నరసింహారావు

**"శీ**లం లేని సాక్షరుడు రాక్షసుడు. కావలసింది కేవలం చదువు మాత్రమే కాదు. సంస్కారం కూడా కావాలి. అందుకే ప్రభుత్వ పాఠ్య ప్రణాళికతో పాటు శిశు మందిరాలలో బాలబాలికలకు నైతిక, ఆధ్యాత్మిక విద్య ద్వారా సంస్కారములు అందజేయబడుచున్నవి" అని **'సదాచారం'** పుస్తకాలకు ముందు మాటలో ప్రాంత కార్యదర్శి **'ఒక్క మాట'** అంటూ తమ ప్రచురణల ఉద్దేశాన్ని వివరించారు. **ఈ ఒక్కమాట** చాలు ఈ పుస్తకాల గురించి పరిచయం చేయడానికి.

ఉదయ తరగతి (Jr.Kg.) నుంచి పదవ తరగతి దాకా శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రచురించిన **'సదాచారం'** పుస్తకాలు ఒక విద్యార్థిని మహోన్నత వ్యక్తిత్వం గల మానవునిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపుదిద్దుకున్నవి. **ఉదయతరగతి (Jr.Kg.), ప్రభాత్ తరగతి (Sr.Kg.) పుస్తకాలను పరిచయం చేయడం ఈ వ్యాసం లక్ష్యం.** కేజీ స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన ఈ పుస్తకాలను పెద్దవాళ్ళు కూడా ఆసక్తిగా చదివే విధంగా రూపొందించడం విశేషం.

ఇక పిల్లల సంగతి చెప్పనవసరం లేదు. అందమైన, భావస్ఫోరక ముఖచిత్రాలతో, రంగులలో ముద్రించిన ఈ పుస్తకం విద్యార్థిని అన్ని విధాలుగా వికసింపజేస్తుంది. విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ నిర్దేశించిన పాఠ్య ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని **'సదాచారం'** పేరుతో నైతిక, ఆధ్యాత్మిక విద్యనందించే ఈ పుస్తకాలను రచించారు





రచయితలు.

**(రచయితల వివరాలు పట్టికలో చూడగలరు)**

**ఉదయతరగతి:–** 'యాకుందేందు...' ప్రార్థనతో ప్రారంభమైన ఈ పుస్తకం ప్రార్థనా శ్లోకాలు, పద్యాలు, గేయాలు, కథలు, సూక్తులు, పొడుపు కథలు, సుభాషితాలు, సామెతల తో విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి శ్రీకారం చుడుతుంది. విద్యార్థి మానసిక ప్రపంచంలో విలువలు వికసించే విధంగా పుస్తకాన్ని రూపొందించారు నిపుణులైన రచయితలు, సమన్వయ కర్తలు.

**ప్రభాత్ తరగతి** (Sr.Kg.) :–




'ఓంకార జప ప్రయోగం' పై స్వామి వివేకానంద వివరణతో ప్రారంభం అయ్యే ఈ పుస్తకం కూడా ఉదయ తరగతి నమూనాలోనే కొంతవరకు ఉంటుంది. శ్లోకాలు, పద్యాలు, గేయాలు, కథలు, కథలపై ప్రశ్నలు, చర్చ, ఆ కథలో ఉండే నీతి పై సూచన మొదలైన వాటితో ప్రతి అక్షరం, పేజీ, అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. 'ఆలోచించండి... చెప్పండి', గేయకథ ప్రయోగాలు అదనంగా జోడించారు. పద్యాలకు, శ్లోకాలకు సరళమైన భాషలో భావం వివరించారు. ప్రాజెక్టు పనులపై సూచనలతో విద్యార్థి భాగస్వామ్యాన్ని పెంచారు రచయితలు. **'సదాచారం'** విద్యార్థుల భవితకు దీపహారం.

**సదాచారం–ఉదయ తరగతి** (Jr.Kg.)**–రచయితలు:** శ్రీ బెల్లాల సుగుణాకర్ , శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు, **సహకారం:** శ్రీమతి అనురాధ, శ్రీ సరస్వతీ విద్యాపీఠం విశ్రాంత ప్రధానాచార్యులు,

**సదాచారం–ప్రభాత్ తరగతి**(Sr.Kg.)**–రచయితలు:** డా॥ ముత్తేవి శ్రీనివాస్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు; శ్రీమతి ముత్తేవి లక్ష్మి, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వాచార్యులు., **సహకారం:** శ్రీ బెల్లాల సుగుణాకర్, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు;

# శ్రీ సరస్వతీ విద్యాపీఠం - పాలమూర్ విభాగ్

## గణిత-విజ్ఞాన-సాంస్కృతిక మేళ - నివేదిక

శ్రీ సరస్వతీ శిశు మందిరాల విభాగ్ స్థాయి గణిత-విజ్ఞాన-సాంస్కృతిక మేళ వనపర్తి పాఠశాల కేంద్రంగా తేదీ: 24, 25 రోజుల్లో నిర్వహించడం జరిగింది. 24వ రోజు ఉదయం ఉద్ఘాటన కార్యక్రమానికి విభాగ్ అధ్యక్షులు శ్రీ ఓబుగారు శ్రీనివాసయ్య గారు శ్రీ కుంటి ఎల్లప్ప గారు విభాగ్ కార్యదర్శి, శ్రీ ఎం. సూర్యనారాయణ గారు వనపర్తి జిల్లా అధ్యక్షులు, శ్రీ జె. ధనుంజయ గౌడ్ గారు వనపర్తి జిల్లా కార్యదర్శి, శ్రీ ఎలా భాస్కర్ గారు నగర కార్యవాహ మరియు, జిల్లా సభ్యులు, శ్రీ జి. భాను ప్రసాద్ గారు జిల్లా కోశాధికారి, శ్రీ అరవింద్ ప్రకాష్ గారు వనపర్తి పాఠశాల కార్యదర్శి, శ్రీ. కె. కృష్ణమోహన్ గారు విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్, శ్రీమతి కవిత గారు మాతృమండలి కార్యదర్శి, శ్రీమతి కరుణ గారు మాతృమండలి సభ్యులు, శ్రీ ప్రతాప్ రెడ్డి ఏ.ఎమ్.ఓ గారు జ్యోతి ప్రజ్వలనతో ఉద్ఘాటన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల నుండి 268 మంది విద్యార్థులు, 73 మంది ఆచార్యులు, పాఠశాల ప్రబంధకారిణి కమిటీ సభ్యులు 10 గురు,జిల్లా కమిటీ 3 విభాగ్ సభ్యులు 5, న్యాయ నిర్ణేతలు (ప్రభుత్వ ఉపాధ్యాయులు) 65 గురు, మొత్తం 424 మంది ఈ కార్యక్రమంలో ఉపస్థితి అయినారు. ఈ విజ్ఞానమేలలో శిశు వర్గ 4,5 తరగతుల వారు శిశు వర్గ (PRI-PRIMARY LEVEL) ఐదు ప్రదర్శనలు, ఒక సైన్స్ పత్ర సమర్పణ, సైన్స్ క్విజ్, సైన్స్ ప్రజెంటేషన్, మాథ్స్ ప్రదర్శన, మ్యాథ్స్ పి.పి.టి. వేదిక్ మాథ్స్ క్విజ్, సంస్కృతి, బోధ కథ కథనం, సంస్కృతి జ్ఞాన క్విజ్, 6,7,8 తరగుతుల నుండి బాలవర్గ (UPPAR PRIMARY LEVEL) ఈ అంశాలతో పాటు, వేదగణితం పత్రం సమర్పణ, మట్టితో నమూనాలు తయారు చేయడం. అదేవిధంగా 9,10 తరగతుల నుండి కిశోర వర్గ (HIGH SCHOOL LEVEL) పై అంశాల అన్నింటిలో పాల్గొనడం జరిగింది. శిశు వర్గలో 15 అంశాలు బాలవర్గలో 17 అంశాలు కిశోర వర్గాల్లో 18 అంశాలు లో విద్యార్థులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా ఆచార్యుల పత్ర సమర్పణ లో ఇద్దరూ ఆచార్యులు పాల్గొనడం జరిగింది.

తేది 25 న నగరంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల నుండి ఇట్టి ప్రదర్శనలను తిలకించి వారి అభిప్రాయాలను తెలియజేసారు. ఇప్పుడు సమరోప్ కార్యక్రమంలో శ్రీ మద్ది అనంత రెడ్డి గారు విభాగ్ ఉపాధ్యక్షుడు, శ్రీ. కందూరు బాలరాజు విభాగ్ సహ కార్యదర్శి, శ్రీ.ఎం సూర్యనారాయణ గారు జోగులాంబ వనపర్తి జిల్లా అధ్యక్షులు, శ్రీ జె ధనుంజయ గౌడ్ వనపర్తి జిల్లా కార్యదర్శి, శ్రీ భాను ప్రసాద్ జిల్లా కోశాధికారి, శ్రీ ఎన్. అరవింద్ ప్రకాష్ గారు పాఠశాల కార్యదర్శిగారు, శ్రీ ఎల్లా భాస్కర్ గారు నగర కార్యవాహ మరియు జిల్లా సభ్యులు, నగర ప్రముఖులు, హితైషులు, పోషకులు, ఎలక్ట్రానిక్ మీడియా మరియు ప్రింట్ మీడియా వారు పాల్గొన్నారు. ★

---

శ్రీమతి అనురాధ, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పూర్వ ప్రధానాచార్యులు.

ఈ రెండు పుస్తకాలకు సమన్వయ బాధ్యతలు నిర్వహించినది... శ్రీ అయాచితుల లక్ష్మణరావు, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్రం కార్యదర్శి; శ్రీ రావుల సూర్యనారాయణ, దక్షిణ మధ్య క్షేత్రం ప్రశిక్షణ ప్రముఖ్. ★

### ప్రతుల కోసం

శ్రీసరస్వతీ విద్యాపీఠం, సాహిత్య విభాగం, ఇం.నెం.6-3-597/ఎ/7, వెంకటరమణ నగర్ కాలని, ఖైరతాబాద్, హైదరాబాద్-500004 చిరునామాకు రాయవచ్చు లేదా ఫోన్‌నెం.040- 23316084, 9441866647 లో సంప్రదించవచ్చు.

వెల రూ॥40/-లు.

# శ్రీ సరస్వతీ శిశుమందిరాల వికాస చరిత్ర

– కె.వి. సత్యనారాయణ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలలో శ్రీ సరస్వతీ శిశు మందిరాలు ప్రారంభమై 1967 నుండి 2025 నాటికి అరువది సంవత్సరములు పూర్తి చేసుకొని విస్తరణ దిశలో కొనసాగుతున్నాయి.

ప్రాథమిక స్థాయి నుండి మాధ్యమిక, ఉన్నత, జూనియర్ కళాశాల, ఇంటర్నేషనల్ స్కూల్ వరకు, ఆచార్య ప్రశిక్షణవర్గ, నిరంతర ప్రశిక్షణ, ఆవాసవిద్యాలయాలుగా వికాస పథంలో నడుస్తున్నాయి.

సంస్థ ప్రారంభ కార్యదర్శిగా అప్పటి సంఘజిల్లా ప్రచారక్ కీ॥శే॥ శలన ఆచార్యులు గారి కృషితో సంస్థ వికాసం కొరకై పలురీతులలో కార్యక్రమాలేర్పాటు చేశారు. పోషకసమావేశాలు, శిశుతీర్థము, ఆచార్యవర్గ, యోగశిక్షణ, శిశు వాటిక, రంగస్థల కార్యక్రమాలు, విద్యార్థులలో ఆచార్యులలో రచనా వ్యాసంగానికై స్ఫూర్తి మాసపత్రిక, భోజనమంత్రం. శాంతిపాఠం, బాలశిబిరం, బాలికాశిబిరం, ఆచార్యుల శిబిరాలు, విద్వత్పరిషత్, గణిత, విజ్ఞానశాస్త్ర మేలాలు, పాఠశాల జిల్లా, విభాగ్, ప్రాంత, క్షేత్ర, అఖిల భారత స్థాయిలలో వివిధ వర్గలు, శిబిరాలు, సమావేశాలు, పర్యటనలు, పూర్ణకాలిక కార్యకర్తల పెంపుదల, ఉత్తమ ఆచార్య బహుమతి ప్రదానము, స్థాయి పెంపుదల కార్యక్రమాలు, పాఠశాలల్లో భవన నిర్మాణాలు, విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, శారీరక, రంగస్థల, బౌద్ధిక స్థాయిలలో పోటీల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగుల అండదండలు, సదాచారం పేరుతో పుస్తకాల ముద్రణ, వితరణ, సాహిత్యవిభాగము, ప్రధానాచార్యులు. పోషకుల, ఆచార్యుల వికాసవర్గలు, గ్రంథాలయాలు, శోధకార్యక్రమాలు, సంగోష్ఠులు, విద్యావిషయమై ప్రభుత్వ సహకారంతో ఎస్.సి.ఇ.ఆర్.టి. ఎన్.సి.ఇ.ఆర్.టి. సంస్థల అధికారులతో సంప్రదింపులు, మూల్యాంకనం, అంకేక్షణవిభాగం ఉత్తమ కార్యాలయ వ్యవస్థ, స్వాగతము, సత్కారము, గ్రంథావిష్కరణలు, ఉత్తమ విద్యార్థి, ఆచార్యులకు బహుమతులు. పోషకులు విద్యాలయాల్లో బాధ్యతల స్వీకరణ, పూర్వవిద్యార్థి సంఘటనము, పూర్వాచార్యులతో నిత్యసంపర్కము, కళాశాల విద్యార్థులతో సంపర్కము, సేవావిభాగము. సైనిక పాఠశాల ఏర్పాటు జరిగింది. సంఘం, వివిధక్షేత్రాల వారితో సమన్వయం–తోడ్పాటు పోషకుల అభిప్రాయాన్ని అనుసరించి మాతృభాషా మాధ్యమంతో పాటు ఆంగ్లభాషా మాధ్యమంగా పాఠశాలల నిర్వహణ, డిజిటల్ పద్ధతిన బ్యాంకు వ్యవహారాలు, కార్యాలయ నిర్వహణ జరుగుచున్నది.

★



**వనపర్తి:–** వనపర్తి లో జరిగిన విభాగ్ స్థాయి గణిత జ్ఞాన విజ్ఞానమేళాలో ప్రభంజనం సృష్టించిన ధూల్ పేట శిశు మందిర్ విద్యార్థులు ఐదు అంశాలకు మూడు ప్రథమ రెండు ద్వితీయ స్థానాలను సంపాదించారు. ★

**"జీవితంలో ధనం కోల్పోతే కొంత కోల్పోయినట్లు ... కానీ వ్యక్తిత్వం కోల్పోతే, సర్వస్వం కోల్పోయినట్లే .."**

**– స్వామి వివేకానంద.**

## తెలంగాణ విద్యార్థులకు గొప్ప అవకాశం.. సైనిక్ స్కూల్ లో అడ్మిషన్లు

తెలంగాణ విద్యార్థులకు గొప్ప అవకాశం లభించింది. విద్యా భారతి ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్ ను ప్రారంభిస్తున్నట్లు విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి, నేతాజీ సైనిక్ స్కూల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ లింగం సుధాకర్ రెడ్డి ప్రకటించారు. నేతాజీ సైనిక్ స్కూలులో అందుబాటులో వున్న 120 సీట్లలో విద్యార్థులకు అవకాశం ఉంటుందని ప్రకటించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లింగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ..




అఖిల భారత సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2025 కి హాజరై, కనీస అర్హత మార్కులు పొందిన విద్యార్థులంతా నేతాజీ సైనిక్ స్కూల్ అడ్మిషన్ పొందేందుకు అర్హులని తెలిపారు. అందుబాటులో ఉన్న సీట్లు సెప్టెంబర్ 23 న AISSAC 2025 పోర్టల్ లో ప్రదర్శిస్తారని అన్నారు. విద్యార్థులు సెప్టెంబర్ 24,25 తేదీల్లో పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని, సెప్టెంబర్ 26 న నేతాజీ సైనిక్ స్కూల్, విజయవాడను ఒకే ఒక్క ఆప్షన్ గా పెడితే పాఠశాలలో ప్రవేశం తప్పనిసరిగా లభిస్తుందని తెలిపారు. నేతాజీ సైనిక్ స్కూల్ లో ఇది మొదటి బ్యాచ్ అని, మెరిట్ జాబితా అక్టోబర్ 4 న పోర్టల్లో ప్రదర్శిస్తారన్నారు. అడ్మిషన్లు 11 నుంచి ప్రారంభం అవుతాయని, అక్టోబర్ 18 కి పూర్తవుతాయని తెలిపారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు డాక్టర్ సీ ఎల్ వెంకట్రావు, విద్యా భారతి క్షేత్ర సంపర్క ప్రముఖ్ వినోద్, తెలంగాణ ప్రాంత అధ్యక్షులు ప్రొఫెసర్ తిరుపతి రావు, దాత సీబీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ★

---

**సత్యాన్ని పలకండి ! ధర్మంగా జీవించండి ! శాస్త్రాల అధ్యయనాన్ని,**

**బోధనను నిర్లక్షము చెయ్యవద్దు ! సత్య మార్గాన్ని విడువవద్దు !**

**నైతిక నియమాలను విడువవద్దు ! సంక్షేమాన్ని విడవ వద్దు !**

**సంపదలను నిర్లక్ష్యము చెచ్యవద్దు !**

**- తైత్తిరియోపనిషత్తు**

వార్తలు



## విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సాగర మాల కార్యక్రమం

విలువలు గల విద్యను అందించటంలో ముందు వరుసలో ఉండే విద్యా భారతి .. మన ఆంధ్రప్రదేశ్ లో చక్కటి కార్యక్రమం నిర్వహించింది. సురక్ష సాగర్, స్వచ్ఛ సాగర్ అనే పేరుతో సాగర తీరాలలో శుభ్రత కార్యక్రమాలను నిర్వహించింది. రాష్ట్రంలోని ముఖ్యమైన బీచ్ ప్రాంతాలకు విద్యార్థులు , టీచర్స్ పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. స్థానికంగా ఉండే యువత తో కలిసి అక్కడ చెత్త పదార్థాలను తొలగించి పరిశుభ్రత ను చేపట్టారు. చిన్నారుల చొరవ ను చూసిన స్థానిక ప్రజలు కూడా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. సంఘ్ చెబుతున్న పంచ పరివర్తన లో భాగంగా పర్యావరణ పరిరక్షణ మీద విద్యార్థులు శ్రద్ధ పెట్టడం అభినందనీయమని స్థానికులు మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటనా కార్యదర్శి కన్నా భాస్కర్, ఆం.ప్ర. అధ్యక్షులు నాగేశ్వరరావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ★

---

## రాష్ట్ర స్థాయి గణిత సాంస్కృతిక విజ్ఞాన మేళా




**కామారెడ్డి** పట్టణ కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి గణిత,సాంస్కృతిక విజ్ఞాన మేళాను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర స్థాయి గణిత సాంస్కృతిక విజ్ఞాన మేళాను ప్రముఖ శాస్త్రవేత్త డా॥పైడి ఎల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా॥ పైడి ఎల్లారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక విలువలతో కూడిన సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకొని, పరిశోధనలు చేసి దేశం గర్వించేలా నిర్మాణమవ్వాలన్నారు. భారతదేశ సాంస్కృతిక పునర్వైభవం స్ఫురించేలా ఎంతో మంది విద్యార్థులు తమతమ విజ్ఞానంతో నూతన పోకడలు సృష్టించాలని ఆకాంక్షించారు. జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు కామారెడ్డి కేంద్రం కావడం గర్వంగా ఉందని సరస్వతీ విద్యా పీఠంలో చదువుకోవడం విద్యార్థుల అదృష్టంగా భావించాలని, ఆ విలువలతో చదువుకొని పేద కుటుంబం నుంచి ఎదిగిన శాస్త్రవేత్త ఎల్లారెడ్డియే ఆదర్శమన్నారు.

ముఖ్య వక్త గా విచ్చేసిన భౌతికశాస్త్రం రిటైర్డ్ ప్రొఫెసర్, సరస్వతీ విద్యా పీఠం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞాన బిక్ష పెట్టిన నలంద, తక్షశిల విద్యాలయాలే భారతదేశ ఔన్నత్యాన్ని తెలియజేసాయన్నారు. 19వ శతాబ్దంలోనే గొప్ప శాస్త్రవేత్తలు రూపొందడానికి భారతీయ విద్యా విజ్ఞానమే ఆదర్శమని గుర్తు చేసారు. విద్యార్థులు సైతం నూతన విద్యా విధానంలో తమ వైజ్ఞానిక పంథాలో ఆలోచనలు చేసి ఎవ్వరికీ తీసిపోకుండా ప్రముఖమైన శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. కామారెడ్డి లో మూడు రోజుల పాటు 12,13,14 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు పాల్గొని సృజనాత్మకత తో కూడిన ప్రాజెక్ట్ లను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన గణిత,సాంస్కృతిక ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డా.శ్యామ్ సుందర్ రావు,కృష్ణమాచార్య, వెంకటమ్మ,బొడ్డు శంకర్, హరిస్మరణ్ రెడ్డి, రాజారెడ్డి, రంజిత్ మోహన్, రవినాథ్ ,ప్రతాప్ గౌడ్,వి.టి లాల్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రధానాచార్యులు, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ★




**సంగారెడ్డి:–** శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల సంగారెడ్డి లో విభాగ్ స్థాయి వివిధ వర్గల సమారోప్ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు శ్రీ Y. ఆంజనేయులు గారు విభాగ్ గౌరవ కార్యదర్శి, శ్రీ GLN శాస్త్రి గారు ప్రాంత సేవా ప్రముఖ్, శ్రీ సురేశ్ గారు విభాగ్ సహ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. ★

---



**కరినగర్:–** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సీజనల్ వ్యాధుల నివారణపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రభుత్వ వైద్యుడు డా॥ శ్రీ కేశవరెడ్డి, వాతావరణ మార్పులతో కలిగే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు, శుభ్రత పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఇంజినీర్ కోల అన్నారెడ్డి, చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, మేచినేని దేవేందర్రావు, రాపర్తి శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గోలి పూర్ణచందర్, డా॥ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, నడిపెల్లి దీందయాళ్ రావు, అప్పిడి వకులదేవి తదితరులు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయుక్తమని పేర్కొన్నారు. ★

---

## శ్రద్ధాంజలి



శ్రీ ప్రేమ్ సాగర్ రావు గారు 03.09.2025 న రాత్రి ఆస్ట్రేలియాలో గుండెపోటుతో మరణించారు. వీరు కార్యాలయ ప్రముఖ్‌గా భైంసా–నిర్మల్ పాఠశాలలో సేవలందించారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది. ★

---



**సదాశివపేట:–** శ్రీ శంకర్ రావు గారు 15 ఆగష్టు న అనారోగ్యంతో పరమపదించారు. వీరు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేశారు. వీరు సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులుగా, ప్రబంధకారిణిలో 3 సంవత్సరాలు సభ్యునిగా, 3 సంవత్సరాలు కోశాధికారిగా, 3 సంవత్సరాలు సహకార్య దర్శిగా, కార్యదర్శిగా, విద్వత్ సమితి సభ్యులుగా సేవలు చేస్తూ మన పాఠశాలలో రకరకాల బాధ్యతలు నిర్వహిస్తూ పాఠశాల అభివృద్ధిలో నిరంతరం అందరితో కలిసి చక్కటి సేవలు అందించారు. వారి దివంగతాత్మకు సద్గతులు సంప్రాప్తమవ్వాలని శ్రీ సరస్వతీ విద్యాపీఠం శ్రద్ధాంజలి ఘటించింది. ★





**శ్రీశారదాధామం** కేంద్రంగా సెప్టెంబర్ 18,19 తేదీల్లో క్షేత్ర స్థాయి గణిత, విజ్ఞాన మేళా జరిగింది. ఈ మేళాకి మూడు రాష్ట్రాలకు చెందిన 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గణితానికి సంబంధించిన వివిధ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. అతిథులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. గణిత విజ్ఞాన మేళా ఉద్ఘాటన కార్యక్రమంలో విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డా॥ చామర్తి ఉమామహేశ్వరరావు, డీఆర్డీవో మాజీ చైర్మన్, శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి, మన దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటాలని ఉద్బోధించారు. శిశు మందిరాలలో విద్యతోపాటు సంస్కారం, క్రమశిక్షణ నేర్పడం అభినందనీయమని కొనియాడారు.






**కామారెడ్డి** పట్టణంలో శ్రీ సరస్వతీ విద్యమందిర్ లో రాష్ట్ర స్థాయి గణిత సాంకృతిక విజ్ఞాన మేళా కార్యక్రమంలో పాల్గొన్న కామారెడ్డి శాసనసభ్యులు శ్రీ కాటిపల్లి వెంకటరమణ రెడ్డి.



ఆదిలాబాద్ కేంద్రంగా జరిగిన ప్రాంత స్థాయి ఖేల్ ఖూద్ ఉద్ఘాటన కార్యక్రమంలో ఖేల్ ఖూద్ "క్రీడా జ్యోతి" ని వెలిగించిన అతిథులు.

RNI No. : 32283
SPHOORTHY (MONTHLY)
Volume : 50 Issue : 10
October - 2025

Postal Reg. No. : D/RNP/HCD-1204/2024-26
Published on 25th of Every Month
Posted on 29th & 30th Every Month
Posting at BPC-IV Partika Channel, Nampally, Hyderabad-01

# ప్రాంత స్థాయి ఖేల్‌కూద్ పోటీలు (తెలంగాణ)



ప్రాంత స్థాయి అథ్లెటిక్సు పోటీలలో కిషోరవర్గ విభాగంలో
మంచిర్యాల విభాగ్ ప్రథమ స్థానంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుంది,
రావుల సూర్యనారాయణ గారు విజేతలకు ట్రోఫీనీ అందజేశారు.





ఆంధ్రప్రదేశ్ ప్రాంత స్థాయి విజ్ఞాన మేళ ( నంద్యాల) ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయకుమారి ప్రారంభోత్సవం చేశారు.
నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి గౌరవనీయులు జనార్ధన రెడ్డి మరియు శ్రీ సరస్వతీ విద్యా పీఠము అనంతపురం సమితి అధ్యక్షులు
విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యకారిణి సదస్యులు - రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి. రామకృష్ణా రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.



**మహేశ్వరం** - నాదర్గుల్‌లోని విద్యా భారతి విజ్ఞాన కేంద్రంలో నిర్మించిన నూతన బాలుర వసతి గృహాన్ని
కేంద్ర మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి
ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు
బహుమతీ ప్రదానం చేశారు.